
హైదరాబాద్ వార్త


# ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేదెన్నడు!

-రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు గంటన్నర సమయం
-విలువైన సమయం వృథా..
-పడిపోతున్న వాహనాల మైలేజీ
-తీవ్రతరంగా ట్రాఫిక్ రద్దీ
-చోద్యం చూస్తున్న యంత్రాంగం



హైద్రాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: మహానగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఎన్ని ఆకాశమార్గాలు నిర్మించినా ఫలితం ఉండటం లేదు. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్ ఆగిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదు. కనిపించినా కేవలం ట్రాఫిక్ పెండింగ్ ఛలాన్ల తనిఖీలకు పరిమితం అవుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించుకొని ఇంటికి చేరాలంటే పద్మవ్యూహాన్ని ఛేధించినంతగా శ్రమించాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులకు నరకాన్ని చవిచూపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అంటే కేవలం చలాన్‌లు విధించడమే తప్ప ట్రాఫిక్ చిక్కులను తప్పించేవారు కాదనేంతగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో నిర్ధిత సమయంలో రాకపోకలు సాగించాల్సి వాహనాలు ఇష్టానుసారంగా తమ ఇష్టమైన సమయంలో నగర రోడ్లపైకి వస్తున్నాయి. దీనికి తోగు కొన్ని ప్రాంతాల్లో భారీ వాహనలు రోడ్లపైనే నిలపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లను నివారించాల్సి న ట్రాఫిక్ పోలీసులు కేవలం ఛలాన్‌లు విధించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలను చేసినా ట్రాఫిక్ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. నగరంలో అందుబాటులో మెట్రో రైళ్లు, ఎంఎంటిఎస్ రైళ్లు, ప్రధాన కూడళ్లలో ఫ్లైఓవర్లు ఉన్నా కూడా ఫలితం దక్కడం లేదు. చాలా వరకు ప్రధాన రోడ్లన్ని వాహనాలతో నిండిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి గమ్యస్థానాలు చేరుకోడానికి రెండు, రెండున్నర గంటల పాటు ఇబ్బందులు పడకతప్పడం లేదు. కొన్ని రహదారుల్లో రద్దీ సమయాల్లో వాహనాలు రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు కనీసం గంటన్నర సమయం పడుతుందంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. దీంతో వాహనాల విలువైన సమయం వృథాకావడంతో పాటు గమ్యం చేసేవరకు రోడ్ల వాహనాల ఇంజన్ ఆన్‌లో ఉండడంతో పెట్రో డీజిల్ ఆవిరైపోతున్నాయి.

**గతంలో ఎన్నడూలేనంతగా..**

నగరంలో నిత్యం కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. అవన్నీ రెండు మూడు గంటల్లోపు సాఫీగా మారతాయి. ఇటీవల ఎన్నడూ కనిపించని ట్రాఫిక్ సమస్య ఇటీవల తీవ్రరూపం తలెత్తుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏ మార్గంలో వెళ్లినా కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయి కనిపించాయి. మాదాపూర్- జూబ్లీహిల్స్- బంజారాహిల్స్, మెహిదీపట్నం- మాసాబ్‌ట్యాంక్, అసెంబ్లీ- అబిడ్స్, ఉప్పల్, హబ్సిగూడ-నాచారం తదితర ప్రాంతాల్లో సాయంంత్రం వరకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. అమీర్‌పేట్-పంజాగుట్ట-ఖైరతాబాద్-లక్డీకాపూల్, మలక్‌పేట్-దిల్‌సుఖ్‌నగర్, మెట్టుగూడ- తార్నాక- ఉప్పల్-మేడిపల్లి, బేగంపేట్-రసూల్‌పురా- సికింద్రాబాద్- మినిస్టర్‌రోడ్, బేగంబజార్- చార్మినార్-అఫ్జల్‌గంజ్-నాంపల్లి లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యం అయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే దాదాపు రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. గతంలో పండుగలు, ఆదివారాలలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. కాని ఇప్పుడు దానికి భిన్నంగా తయారైంది.

**ఇలా చేస్తేనే ఫలితం..**

-ట్రాఫిక్ విభాగంలో ట్రాఫిక్‌పై అవగాహన ఉన్న అధికారులను నియమించాలి.
-కొన్ని జంక్షన్లను, మలుపులను విస్తరించాలి.
-ఫ్లైఓవర్ బ్రిడ్జిల వద్ద సర్వీస్ రోడ్లను అందుబాటులో ఉంచాలి.
- ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి న ట్రాఫిక్ పోలీసులు ఛలాన్‌ల వసూల్‌లపై దృష్టిసారిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందికి రోజువారి టార్గెట్‌లను విధించడం వల్ల వారు ఛలాన్‌లు విధించడంపైనే దృష్టి సారిస్తున్నారు.
- వాహనాలకు అడ్డుగా వెళ్లి వాహనాలను నిలిపి పెండింగ్ ఛలాన్ల పరిశీలన, డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీ తీరులో వెనుక నుండి వచ్చే వాహనాలను నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య సమస్య ఏర్పాడుతోంది.
- ప్రతి చౌరస్తాల్లో ట్రాఫిక్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేసేలా చూడాలి,
-జిబ్రాక్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలి. మొబైల్ ట్రాఫిక్ వాహనాలను అందుబాటులో ఉంచాలి.
-పుట్‌పాత్‌లు అక్రమణలు గురికాకుండా చూడాలి. అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలి.
-కొన్ని బిర్యాని సెంటర్లు, బార్‌లు, వైన్స్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు వసూళ్లకు పాల్పడుతుండడం వల్ల ఇక్కడి ట్రాఫిక్‌ను నియంత్రించడంలో వెను కంజ వేస్తున్నారు. వాటిపట్ల కఠినంగా వ్యవహరించాలి.

# మిగిలింది వారమే..



-ఈనెలాఖరుతో ముగియనున్న ఓటిఎస్ గడువు
-ప్రాపర్టీ టాక్స్ బకాయిలపై 90శాతం వడ్డీ రాయితీ
-కలెక్షన్ టార్గెట్ 2000కోట్లు టాక్స్ 1641కోట్లు
-ఇంకా వసూలు చేయాల్సింది 359 కోట్లు
-మొండి బకాయిదారులకు నోటీసులు ఇస్తున్న సిబ్బంది
-నోటీసులకు స్పందించకుంటే భవనాలు సీజ్

హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త: జీహెచ్‌ఎంసీ ప్రధాన ఆర్థిక వనరైన ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ (2024-25) టార్గెట్ సాధనకు ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎలాగైనా పెట్టుకున్న టార్గెట్ పూర్తి చేయాలని రాత్రిపగలు శ్రమిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2 వేల కోట్లను లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు సుమారు రూ.1641 కోట్ల మేరకు ట్యాక్స్ వసూలైంది. ఓటిఎస్ ద్వారా పెట్టుకున్న టార్గెట్‌కు ఈ నెలాఖరు కల్లా ఇంకా రూ. 359 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ చేయాల్సి ఉంది. ట్యాక్స్ బకాయిలపై 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ ఈ నెల 8వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన వన్ టైమ్ సెటిల్ మెంట్ (ఓటీఎస్) స్కీం కింద ఇప్పటి వరకు రూ.92 కోట్లు కలెక్షన్ అయినట్లు అధికారులు తెలిపారు. టార్గెట్ కు తగ్గట్టు ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ చేసేందుకు ప్రతి సర్కిల్ లో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ), ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ (టీఐ), బిల్ కలెక్టర్ (బీసీ)ల వారీగా టార్గెట్ కు కేటాయించారు. మూడు దశల్లో ఏఎంసీ, టీఐ, బీసీలు చేసే కలెక్షన్ ను పర్యవేక్షించే బాధ్యతను డిప్యూటీ కమిషనర్లకు అప్పగించారు. డిప్యూటీ కమిషనర్ తన సర్కిల్ పరిధిలోని సర్కారు బకాయిల వసూల్లకు ఆయా విభాగాధిపతులను తరుచూ సంప్రదింపులు జరుపుతూ ట్యాక్స్ కలెక్షన్ చేయాలని ఇప్పటికే కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. వన్ టైమ్ సెటిల్ మెంట్ (ఓటీఎస్) అమల్లోకి తెచ్చినా ట్యాక్స్ చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. స్కీమ్ అమల్లో రాగానే ఈ స్కీమ్ తో సుమారు రూ. 300 కోట్ల వరకు కలెక్షన్ అవుతుందని అధికారులు అంచనా కానీ స్కీమ్ అమల్లోకి వచ్చిన ఈ నెల 8వ తేదీ నుంచి ఇప్పటి వరకు కేవలం రూ.92 కోట్లు మాత్రమే వసూలు కావటంతో అధికారులు కలెక్షన్ ను పెంచుకునేందుకు వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా నిర్ణీత గడువులోపు స్పందించని భవన యజమానులను గుర్తించి, వారెంట్లు జారీ చేసిన భవనాలను సీజ్ చేస్తున్నారు.

**మిగిలింది వారమే..**

ఈఆర్థిక సంవత్సరం మార్చి 31కి మంగళవారం నుంచి ఏడు రోజుల గడువు మాత్రమే ఉంది. పెట్టుకున్న టార్గెట్ ఎలాగైన పూర్తి చేయాలని అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రోజు ఉదయం..సాయంత్రం సమీక్షలు నిర్వహిస్తూ రోజు ఎంత వసూలైంది..ఇంకా కావాల్సింది ఎంత..? రేపు ఎక్కడెక్కడ ఏం చేయాలని అనేదానిపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో మీటింగ్‌లు పెట్టుకుంటూ టార్గెట్ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రూ. 2 వేల కోట్ల మైలురాయి దాటించాలని కమిషనర్ ఇలంబర్తి సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సర్కిల్ లో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్లను సాధారణ సెలవులతో పాటు పండుగ సెలవుల్లో కూడా ప్రతి రోజు రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉంచాలని, ప్రతి సెలవు రోజున ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## రవాణా రంగ కార్మికుల హామీలను అమలు చేయాలి




నారాయణగూడ చౌరస్తాలో ప్రదర్శన నిర్వహిస్తున ్న కార్మికులు

**సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రవాణారంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది కార్మికులు సోమవారం నారాయణగూడ చౌరస్తాలో ప్రదర్శన నిర్వహించారు. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టియుసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో ఆనేక మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసిప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి పిలుపు మేరకు ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారని చెప్పారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బిజ్జల రామకృష్ణారెడ్డి, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్మికులు ఎంతో కృషి చేశారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినప్పటికి ఇంతవరకు అమలు చేయలేదని ఆరోపించారు. ఆటో కార్మికులకు ఏడాదికి 12 వేల రూపాయలతోపాటు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కందుల ఉపేందర్, ఎస్.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ కనిపించడం లేదు..

-ప్రజావాణిలో బిజెపి కార్పొరేటర్ ఫిర్యాదు




ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రావణ్

హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కనిపించడం లేదని మల్కాజ్‌గిరి బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని సమస్యలపై ఆమె శ్రద్ధ చూపడం లేదని కనీసం ఆమె కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండటం లేదని శ్రవణ్ ఆరోపించారు. నగరంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ, మేయర్ వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం కోసం ఆమె స్వయంగా పర్యటించడం లేదని పేర్కొన్నారు. కనీసం కార్యాలయంలో కూడా ఆమె అందుబాటులో ఉండకపోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని అన్నారు. పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, చెత్త సమస్య, రోడ్ల దుస్థితి వంటి అంశాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ప్రజా సమస్యలపై మేయర్ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ భూమిని కాపాడండి

-హైడ్రా ప్రజావాణికి 63 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమిని స్థానికంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు కబ్జా చేసేస్తున్నారని.. వాటిని కాపాడాలని పలువురు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. పాఠశాలకు, పిల్లలు ఆడుకునేందుకు ఉద్దేశించిన స్థలాలను కూడా వదలడంలేదని వాపోయారు. ఫుట్ పాత్‌లను, సర్వీసు రోడ్డులను వదలకుండా తోపుడు బళ్ల నుంచి ఏకంగా డబ్బాలు పెట్టేసి వ్యాపారాలు చేసుకుంటున్నారని.. వాటిని తొలగిస్తే ప్రదాన రహదారులకు ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాలకు ఎంతో ఉపశమనంగా ఉంటుందని పేర్కొన్నారు. చెరువుల్లో వ్యవసాయం చేసుకోవడానికి మాత్రమే పరిమితమవ్వాల్సి న శిఖం భూములలో పక్కన పట్టా భూమి సర్వే నంబరు చూపించి అనుమతులు తీసుకుని ఇళ్లు కట్టేస్తున్నారని ఫిర్యాదులందాయి. దీంతో తాము వ్యవసాయ భూమిని కోల్పోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇలా సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులందాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఇంజాపూర్ గ్రామంలో పాఠశాలకు ఆనుకుని ఉన్న 14 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నాడని ప్రజావాణికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలుమార్లు ఆయన నుంచి భూమిని కాపాడి.. ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టినా.. మళ్లీ అదే పని చేస్తున్నాడని వాపోయారు. పాఠశాల విస్తరణకు, పిల్లల ఆట స్థలానికి ఉపయోగపడేలా చూడాలని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదులో కోరారు. మియాపూర్ బీహెచ్ ఈఎల్ ప్రధాన రహదారిలో ఉన్న గంగారాం చెరువు ఎఫ్‌టీఎల్ ఎగువున మాఇంటి స్థలాలున్నా.. నిర్మాణానికి అనుమతులివ్వడంలేదని పలువురు వాపోయారు. తమ ఇంటి స్థలం చుట్టూ ఇళ్లు నిర్మించి ఉన్నాయని గ్రామపంచాయతీ లేఔట్‌కు ఎల్ఆర్ఎస్ కూడా కట్టించుకుని రెగ్యులరైజ్ చేశారని.. మాకు మాత్రం అనుమతించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం, నాగారం మున్సిపాలిటీలోని అన్నరాయ చెరువులో తనకున్న ఎకరం శిఖం భూమిని పక్కనే లేఔట్ వేసిన వ్యక్తి ఆక్రమించి దానిని కూడా ప్లాట్ల మాదిరి అమ్మేస్తున్నారని.. ఇప్పటికే పలు షెడ్డులు వేశారని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి గ్రామంలోని ఊరచెరువుకు ఉన్న పాత నాలాను పునరుద్ధరించాలని పలువురు ప్రజావాణి ఫిర్యాదులో కోరారు. వరదలు వచ్చినప్పుడు తాత్కాలిక ఉపశమనం కోసం తవ్విన నాలాను కొనసాగించడం వల్ల పంటపొలాలు దెబ్బతిన్నాయని వాపోయారు. దిగువున ఉన్న 6కాలనీలకుకు వరద, మురుగు ముప్పు లేకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## హత్యకు గురైన గుర్తు తెలియని యువకుడు

**బేగంబజార్, మార్చి 24 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తులు ఓ గుర్తు తెలియని వ్యక్తిని దారుణగా హత్యచేసిన సంఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం...నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలోని మనోరంజని కాంప్లెక్స్ వెనుక భాగంగా సుమారు 30 సంవత్సరాల గుర్తు తెలియని యువకుడు తీవ్ర గాయాలతో హత్యకు గురై పడి ఉన్నట్లు స్థానికులు బేగంబజార్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ అబిడ్స్ఎసిపి చంద్రశేఖర్‌కు సమాచారం అందించారు. మనోరంజన్ కాంప్లెక్స్ ప్రాంతానికి చేరుకుని హత్యకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ కాంప్లెక్స్ ఫస్ట్‌ఫ్లోర్‌లో చత్తీస్‌ఘడ్ ప్రాంతానికి చెందిన ఉంటున్నారని తెలిపారు. ఆదివారం రాత్రి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కాంప్లెక్స్‌లోకి వెళ్లినట్లు పోలీసులకు చెప్పారు. ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అందులో ఆవ్యక్తి తీవ్ర గాయాలకు గురై హత్యకు గురై ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు వచ్చిన వారిలో ఒకరు పారిపోవడం చూస్తే ఆ గుర్తుతెలియని మరో గుర్తుతెలియని వ్యక్తిపై దాడి చేయడం మూలంగానే హత్యకు గురై ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మనోరంజన్ కాంప్లెక్స్ హత్యకు గురైన వ్యక్తి మృతదేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెల్లటి టిషర్ట ఉందని పోలీసులు తెలిపారు. తొందరంగానే కేసు మిష్టరిని చేధిస్తామని పోలీసులు తెలిపారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి




ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ

**ధర్నాచౌక్, మార్చి 24, ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనం అమలుచేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా హామీ అమలుచేయలేదని ఆరోపించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో పనిచేస్తున్న మహిళలంతా అట్టడుగు వర్గాలకు చెందినవారేనని, వారికిచ్చే వేతనాలు చాలా తక్కువ, అది కూడా నెలల తరబడి పెండింగ్ ఉంటోందని అన్నారు. భారత దేశంలో సగం మంది పిల్లలు పోషకాహార లేమితో బాధపడుతున్నారని, ఆకలితో అలమటించే పిల్లలకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతోందని తెలిపారు. ఈ పథకం వల్ల పాఠశాలలో చదువుకునే వారి సంఖ్య పెరుగుతుందని, సామాజిక సమానత్వం కాపాడటానికి బాగా దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధితో ధరలకు అనుగుణంగా అవసరమైన బడ్జెట్‌ను కేటాయించి, ఈ పథకాన్ని అమలుచేస్తే మంచి ఫలితాలు పొందవచ్చునని సూచించారు. కేంద్ర స్కీంలకు కేంద్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడం వల్ల దీని ప్రభావం మధ్యాహ్న భోజన కార్మికులపై కూడా పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి, మధ్యాహ్న కార్మికుమలకు పదివేల వేతనం అమలుచేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ, చిన్నమ్మ, ఉన్ని కృష్ణ, మాయ తదితరులు పాల్గొన్నారు.

## ఘరానా మోసగాడి కోసం గాలింపు ముమ్మరం

గచ్చిబౌలి, మార్చి 24 ప్రభాతవార్త

బంగారం బిస్కెట్లు, డాలర్లతో వ్యాపారులను మోసగించి ఉడాయించిన నింధితుడి కోసం గచ్చిబౌలి పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ప్రత్యేక బ ృందాలను ఏర్పాటు చేసి ఇతర రా ష్ట్రాల్లో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని డిఎల్ఎఫ్ సమీపంలో ఓ హోటల్‌లో నగర వ్యాపారులకు కలిసిన నిందితుడు వారికి మాయమాటలు చెప్పి 500 గ్రాముల బంగారు బిస్కెట్లు, 18వేల అమెరికన్ డాలర్లతో ఉడాయించిన విషయం తెలిసిందే. వ్యాపారుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కాగా కారు అద్దెకు తీసుకున్న సమయంలో నిందితుడు ఇచ్చిన ఆధార్ కార్డు ఆధారంగా నిందితుడిని స్టీవ్ గాడ్‌విన్‌గా పోలీసులు గుర్తించగా, విచారణలో నిందితుడు ఇచ్చిన ఆధార్ కార్డు నకిలీదని తేలింది. పోలీసులకు నిందితుడి ఫోటో లభించ ుగా, గచ్చిబౌలి పోలీసులు ప్రత్యేక బ ృందాలను ఏర్పాటు చేసి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో గాలిస్తున్నారు. కాగా పోలీసులు ఈ మేరకు నిందితుడికి సంబంధించిన పలు వివరాలను సేకరించినట్లు తెలుస్తుంది.

## టిబి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తదితరులు

హైదరాబాద్, మార్చి24, ప్రభాతవార్త: టిబి రహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, ప్రపంచ టీబి దినోత్సవం పురస్కరించుకొని చెస్ట్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ కేసులను గుర్తించి త్వరగా నివేదించడం, క్షయవ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం అత్యవసరమని స్పష్టం చేశారు టీబి రహిత హైదరాబాద్ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలన్నీ తప్పనిసరిగా తమ దగ్గర నమోదైన టీబీ కేసులను అధికారికంగా ప్రభుత్వానికి నివేదించాల్సి న బాధ్యత ఉందన్నారు. ప్రతి ఆరోగ్య సంరక్షణ కేంద్రం, ప్రైవేట్ వైద్యులు కూడా టీబీ కేసులను నమోదు చేయడం కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా చట్టబద్ధమైన కర్తవ్యమన్నారు.

ఈ సందర్భంగా మెరుగైన సేవలు అందించిన ఉద్యోగులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, డా. రాజేశ్వరి, డా. స్నేహ శుక్లా మాట్లాడుతూ టీబీ వ్యాధి ప్రబలుతున్న తీరును, అలాగే అంతర్జాతీయ స్థాయిలో తీసు కుంటున్న వ్యూహాలను వివరించారు. డా. శ్రవణ్ కుమార్ చెస్ట్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలి : భరత్‌గౌడ్


భరత్‌గౌడ్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు యుద్ధసైనికుల్లాగా పనిచేయాలని మహంకాళి జిల్లా బిజెపి అధ్యక్షుడు భరత్ గౌడ్ అన్నారు. సోమవారం భరత గౌడ్‌ను బిజెపి నేత దోనేటి సత్యం మరికొంత మంది నేతలు, కార్యకర్తలతో కలిసి భేటి అయ్యారు. ఈ కార్యక్రమంలో భోలక్ పూర్ డివిజన్ అధ్యక్షులు వి రాజశేఖర్, రవీందర్ గౌడ్, లక్ష్మీనారాయణ (బంటి),మారుతి, కార్తీక్, ఉల్లాస్. కిరణ్ ఇతర బిజెపి సభ్యులు పాల్గొన్నారు

## నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి న్యాయం చేయాలి : ఎమ్మెల్యే శ్రీ గణేష్

**కంటోన్మెంట్,మార్చి 24 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్‌లోని రక్షణ శాఖ,సివిల్ ఎవియేషన్ స్థలాల్లో నివాసం ఉంటున్న 11 వేల కుటుంబాలకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అసెంబ్లీలో ప్రస్తావించారు. రక్షణ శాఖ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదలు కొన్ని సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారు.వారికి కనీస సౌకర్యాలు మెరుగుపర్చడంలో బోర్డు విఫలమైందన్నారు. అసెంబ్లీ సాక్షిగా 11 వేల కుటుంబాలను బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదన్నారు. రక్షణ శాఖ స్థలాల్లో సాయిబాబా హట్స్, చిన్న కమేళా, నందమూరి నగర్, మడ్‌ఫోర్ట్ హట్స్,108 బజార్, సెంట్రల్ బ్యాట్రీ, రెడ్డి కంపౌండ్, సివిలి ఎవియేషన్ స్థలాల్లో అన్నా నగర్, రసూల్‌పురా, ఇందిరమ్మ నగర్, శ్రీలంక బస్తీలలో కనీస సౌకర్యాలు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే వాటిపై దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వంతో భూములను బదలాయించుకొని పేదల సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలన్నారు.

## అందుబాటులోకి స్పోర్ట్స్ షోరూం

**మెహిదీపట్నం, మార్చి 24, ప్రభాతవార్త :** నగర ప్రజలకు మరో స్పోర్ట్స్ బైక్స్ షోరూమ్, సర్వీసింగ్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. గుడిమల్కాపూర్ ఫిల్లర్ నెంబర్ 71 వద్ద సోమవారం ఫార్చ్యూన్ హోండా బిగ్ వింగ్ స్పోర్ట్స్ బైక్స్ షోరూమ్ కమ్ సర్వీసింగ్‌సెంటర్ ఘనంగా ప్రారంభించబడింది. హోండా కంపెనీ డీల్ డెవలప్‌మెంట్ మేనేజర్ మోహిత్ దిమాన్, మేనేజర్ దేవర్గా దత్తా ఎగ్జిక్యూటివ్ రాజేత్ మహాజన్‌లు బిగ్ వింగ్ షోరూమ్, సర్వీసింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు కస్టమర్లకు స్పోర్ట్స్ బైక్‌లను డెలివరీ చేశారు. అనంతరం ఫార్చ్యూన్ హోండా డైరెక్టర్లు నీరవ్ మోదీ, అశీశ్ మోదీ, సీఈవో పీటర్ పాల్, సీయఫ్ఓ రవి ప్రకాష్ లు మీడియా సమావేశంలో తమ స్పోర్ట్స్ బైక్ ల విశిష్టతలు, షోరూమ్, సర్వీసింగ్ సెంటర్ విశేషాల గురించి వివరించారు.

## సెమిస్టర్ ఫలితాలను తక్షణమే ప్రకటించాలి


ప్రిన్సిపల్ ఛాంబర్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

**సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** సెమిస్టర్ ఫలితాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిజాం కళాశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్ ఛాంబర్‌ను ముట్టడించారు. విద్యార్థులు ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం డిగ్రీ 3వ సంవత్సరం విద్యార్థులకు 5వ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించి, ఇంతవరకు ఫలితాలు ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఫలితాలు ప్రకటించకపోవడం వల్ల విద్యార్థులు ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఆనేక కళాశాలలో ఫలితాలు ప్రకటించాయని, కాని ఒక్క నిజాం కళాశాల మాత్రమే ప్రకటించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ఏమౌవుతుందోనని ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ తక్షణమే ఫలితాలను ప్రకటించాలని వారు డిమండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దీంతో విద్యార్థుల వద్దకు వచ్చిన ప్రిన్సిపల్ రాజశేఖర్ వచ్చి కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఫలితాలను ప్రకటించలేకపోయామని, ఏప్రిల్ 7వ తేదీ లోగా ఫలితాలను ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

## ఎయిడెడ్ టీచర్లకు జీతాలివ్వండి : టీఎస్‌యూటీఎఫ్

**ముషీరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లకు, మోడల్ స్కూళ్లల్లో పనిచేస్తున్న టీచర్లకు ఫిబ్రవరి నెల జీతాలు తక్షణమే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకటేల్లు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 010 పద్దు కింద వేతనాలు పొందే ఉద్యోగులకు మాత్రమే ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు విడుదల చేస్తున్నప్పటికీ ఇతర ఉద్యోగులకు మాత్రం వేతనాల చెల్లింపుకు నిర్దిష్ట తేదీ ఉండటం లేదని ఆరోపించారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులు కొందరికి జనవరి వేతనాలు కూడా ఇంకా అందలేదని, ఫిబ్రవరి నెల వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేయలేదని, నిర్ణీత సమయానికి వేతనాలు అందక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఇ కుబేర్‌లో పెండింగ్ ఉన్న ఎయిడెడ్ మరియు మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల జనవరి, ఫిబ్రవరి వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు వినతి పత్రం అందచేశారు.

## బాలాజీ నగర్‌లో ఉచిత ఆరోగ్య కేంద్రం


ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన బిజెపి రాష్ట్ర నాయకులు వై.అనిల్ చారి.

**మెహిదీపట్నం, మార్చి 24, ప్రభాతవార్త :** ఉచిత ఆరోగ్య కేంద్రాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని బిజెపి రాష్ట్ర నాయకులు వై. అనిల్ కుమార్ చారి అన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో సోమవారం విజయ దయాగ్నాస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్రీ హెల్త్ క్యాంప్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వై. అనిల్ చారి మాట్లాడుతూ.. ఫ్రీ హెల్త్ క్యాంపులు బస్తీలు, కాలనీలలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పేద ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో విజయ దయాగ్నస్టిక్ సెంటర్ వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి, కాలనీ పెద్దలు నరసింహారెడ్డి, నరహరి చారి, శర్మ, డాక్టర్ లక్ష్మణ్ రావు, రాజు, విజయ దయాగ్నాస్టిక్ సెంటర్ ఏరియా ఇన్ చార్జ్ శ్రీకాంత్, శాపద్ ఖాన్ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వాహనదారులూ... వేగం కన్నా ప్రాణాలు మిన్న

- ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి
- ఎంజిఐటిలో రహదారి ప్రమాదాలపై పేయింటింగ్ పోటీలు


రహదారి ప్రమాదాల పేయింటింగ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి.

**నార్సింగి, మార్చి 24 ప్రభాతవార్త :** వాహనదారులూ... వేగం కన్నా ప్రాణాలు మిన్న అన్న విషయంను అనుక్షణం గుర్తుంచుకోవాలని ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులకు "రహదారి ప్రమాదాలు"పై పేయింటింగ్ పోటీలను నిర్వహించింది. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని అతివేగంతో అంగవైకల్యం, ప్రాణాలు కోల్పోయిన చిత్రాలు, ఆపై తల్లిదండ్రులు, భార్యా, బిడ్డల కష్టాలు కళ్లకు కట్టినట్లు పేయింటింగ్‌లు వేసి నిర్వాహకులచేత శభాష్ అనిపించుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు కూడా అందించి, అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువత అతివేగంగా వాహనాలు తోలి తమ ప్రాణాలను కోల్పోతూ, తల్లిదండ్రులకు తీరని దుఃఖంను మిగిలిస్తున్నారన్నారు. అతివేగం ప్రాణాంతకానికి దారి తీస్తుందన్న వాస్తవంను వాహనదారులంతా గుర్తుంచుకోవాలన్నారు. వాహనంపై కూర్చున్న ప్రతీసారి మనపై ఆధారపడ్డ తల్లిదండ్రులు, భార్యా, బిడ్డలను గుర్తు చేసుకొని వాహనాలను నడిపించాలని సూచించారు. రహదారి భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ద్విచక్రవాహనదారులైతే హెల్మెట్‌ను, కార్లు తోలే వారైతే సీటు బెల్టులను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, ఆర్ట్స్ క్లబ్ ఇంచార్జి ఏ.వీరభద్రారావ్, డాక్టర్ యం.రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించిన జలమండలి అధికారులకు సన్మానం


జల మండలి మేనేజర్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పోరేటర్ సంతోషిరెడ్డి.

**నార్సింగి, మార్చి 24 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని మూడో వార్డులో నీటి సమస్య పరిష్కారంకు కృషి చేసిన జిఎం, మేనేజర్లకు మాజీ కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వేసవి ప్రారంభం కావడంతో మూడో వార్డులోని చాలా ఇళ్లల్లో ఉన్న బోర్లు ఎండిపోయాయి. జల మండలి నుంచి వచ్చే నీరు సన్నని ధారలాగా సరఫరా అవుతుంది. వారానికి ఒకసారి మాత్రమే వదులుతున్నారు. దీంతో ప్రజలు నీటి సమస్యతో అల్లాడిపోయారు. ప్రజల ఇబ్బందులను చూసిన మాజీ కార్పోరేటర్ సంతోషిరాజిరెడ్డి వెంటనే జల మండలి జీఎం, మేనేజర్, మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలను కలిసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. పలుమార్లు వారి కార్యాలయాల చుట్టూ తిరిగారు. దీంతో స్పందించిన జల మండలి జీఎం, మేనేజర్లు మూడో వార్డులో జంక్షన్ ఏర్పాటు చేసి, కొత్త మోటార్‌ను బిగించారు. దీంతో నీటి సరఫరా పెరిగింది. నీటి సరఫరాను పెంచిన జల మండలి అధికారులందరిని సోమవారం సంతోషిరాజిరెడ్డి కలిసి శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ముగిసేంత వరకు రెండు రోజులకు ఒకమారు ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని అధికారులను కోరామన్నారు. జంక్షన్ ఏర్పాటుతో నీటి ఇబ్బందులు చాలా వరకు దూరమవుతాయని పేర్కొన్నారు. ఎంపిటిసిగా, కార్పోరేటర్‌గా రెండుమార్లు ఎన్నికల్లో ఓట్లు వేసి నన్ను గెలిపించిన ప్రజల కోసం అహర్నిషలు కష్టపడుతానని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దూరం చేయడంలో కలిగే సంతృప్తి మాటల్లో వర్ణించలేమని, అనుభవిస్తేనే తెలుస్తుందన్నారు.

## డంపింగ్‌యార్డ్‌ను రద్దు చేయాలి : జూలకంటి రంగారెడ్డి


ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ఎస్.వీరయ్య

**ధర్నాచౌక్, మార్చి 24, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో సంగారెడ్డి జిల్లా ప్రజాసంఘాల పోరాట వేదిక జేఏసీ ఆధ్వర్యంలో ప్యారానగర్, నల్లవల్లి డంపింగ్‌యార్డులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములుతో కలిసి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ప్యారానగర్, నల్లవల్లి ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనావాసాలకు దూరంగా పర్యావరణానికి నష్టం లేకుండా డంపింగ్‌యార్డు ఏర్పాటుచేయాలని సూచించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ గ్రామంలో, మండలంలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, ప్రజలకు వ్యతిరేకంగా ప్యారానగర్‌లో 152 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డుకు కేటాయించిందని, జీహెచ్ఎంసీ రాంకీ సంస్థకు డంపింగ్‌యార్డు నిర్మాణ పనులు అప్పజెప్పిందని ఆరోపించారు. మూడు లక్షల మంది ప్రజలపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది కాబట్టి తక్షనమే డంపింగ్ యార్డు పనులను ఆపాలని, డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ జైపాల్‌రెడ్డి, ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కే.రాజయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు, జేఏసీ నాయకులు రామక్రిష్ణ, మల్లేశం గౌడ్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## పురస్కారాలు మరింత బాధ్యతలను పెంచుతాయి : జస్టిస్ చంద్రయ్య


డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డికి పురస్కారాన్ని అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి చంద్రయ్య

**చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త:** సమాజంలో వివిధ సేవలందిస్తూ పురస్కారాలు అందుకున్న వారికి మరింత బాధ్యతను పెంచుతాయని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి చంద్రయ్య అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సర్వేజనా సుఖినోభవంతు సంస్థ ఎనిమిదవ వార్షికోత్సవం, ఉగాది పండుగ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించివారికి సేవా స్వర్ణనంది, విశ్వావసు ఉగాది జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ స్థాపక అధ్యక్షుడు ఇఎస్.సూర్యనారాయణ మాష్టారు, ప్రధాన కార్యదర్శి ఇ.సూర్యతేజ సూత్రాంత్ మాస్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ చంద్రయ్య హాజరై వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న సేవలందిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్, డిస్టిక్ 320ఏ లయన్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డికి వైద్య సేవా రత్న జాతీయ పురస్కారం ను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ మాస్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఖ్య శాస్త్ర నిబంధనలు దైవజ్ఞ శర్మ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మందడి కృష్ణారెడ్డి, కూచిపూడి నాటి గురువు భారతి, లయన్ నైనా దేవి, ఉమా శంకర్ రెడ్డి, కృష్ణాది శేష తదితరులు పాల్గొన్నారు.

## బహుగళ గాయకుడు పేరి నాగేశ్వర్ రావు


గాయనీ గాయకులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త:** బహుగళ గాయకుడు పేరి నాగేశ్వర్ రావు అని ప్రముఖ రచయిత, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ పూర్వ జనరల్ మేనేజర్ వి.హరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ధ్యుతి మ్యూజికల్ అకాడమీ ఇషాన్ ఫౌండేషన్, విజయ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పాత కొత్త పాటలతో సుమధుర సినీ సంగీత విభావరి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభ లోని కళా మారుతీ కళావేదికలో నిర్వాహకులు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి నిర్వహణలో జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన హరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంగీత పరంగా ఎందరో గాయకులకు తమ వేదిక పై అవకాశాలు కల్పిస్తూ సామాజిక పరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పేరి దంపతులు ఆదర్శప్రాయులని ప్రశంసించారు. గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు తో పాటు సంగీత పరంగా సినీ పాటల విభావరి లు పలు వేదికల పై నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిధితులుగా పేరి భీమశంకరం, పేరి దేవి, సిండికేట్ బ్యాంకు పూర్వ ఏజిఎం పేరి కామేశ్వర రావు, స్వరకిన్నెర త్రినాథ్ రావు పాల్గొనగా పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయ లక్ష్మి స్వర సారథ్యంలో గాయకులు హనుమంత, కర్రా శ్రీనివాస్, కళ్యాణి దేశ్ పాండే, ప్రసన్న తదితరులు పాల్గొని అద్భుతంగా గానం చేసారు. అనంతరం పేరి నాగేశ్వర రావు పేరి విజయ లక్ష్మి లను అతిధులు ఘనంగా సత్కరించారు.

## నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం -ఎమ్మెల్యే ముఠాగోపాల్


ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని రామ్‌నగర్ డివిజన్ రిసాల కుర్షిద్ లో సమస్య పై స్థానికుల ఫిర్యాదు మేరకు జిహెచ్ఎంసి, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో స్థానికులు ఎమ్మెల్యేను కలిసి గోల్కొండ చౌరస్తా నుండి రిసాలకుర్షిద్ వరకు, మజీద్ వరకు సీసీ రోడ్డు, ముస్లిం స్మశానంలో స్ట్రీట్ దీపాలు ఏర్పాటు చేయాలని, మెస్సాచర్చి లైన్ అంబేద్కర్ నగర్ పలు ప్రాంతాలలో డ్రైనేజీ, మంచి నీటి పైప్ లైన్ వేయాలని కోరారు. వీధిదీపాలను ఆధునీకరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. వాటర్‌బోర్డు డీజీఎం మోహన్ రాజు, మేనేజర్ శివసాయి, సూపెర్వైజర్ గౌస్, జిహెచ్ఎంసి డీఈ గీత, ఏఈ మురళీ ఇతర సిబ్బంది తో పాటు రామ్‌నగర్ డివిజన్ అధ్యక్షులు టీ.శంకర్ ముదిరాజ్.ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి.ముచ్చుకుర్తి ప్రభాకర్.ముక్తార్ హుస్సేన్, ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్. ప్రవీణ్ ముదిరాజ్. ఇలామ్ హుస్సేన్. పూస గోరక్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.కృష్ణయ్యపై జాజుల చేసిన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలి

-లేని పక్షంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొన వలసి వస్తుంది
-పలు బిసి సంఘాలు హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న రాంమూర్తిగౌడ్

**సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై బిసి నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పలు బిసి సంఘాలు డిమాండ్ చేశాయి. వేలాది ఉద్యమాలు చేసి, జివోలను తీసుకువచ్చి కోట్లాది మందికి విశేషమైన సేవలు అందించిన ఆర్.కృష్ణయ్యను జాజుల విమర్శించడం సిగ్గుచేటని బిసి సంఘాల నేతలు విమర్శించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి విద్యార్థి, యువజన సంఘం అధ్యక్షుడు రాంమూర్తిగౌడ్, బిసి నేతలు ర్యాగ రమేష్, నీల వెంకటేష్, సి.రాజేందర్, అనంతయ్య, నిఖిల్‌పటేల్ మాట్లాడుతూ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇటీవల ఒక సమావేశంలో తన స్థాయికి మించి ఆర్.కృష్ణయ్యపై తప్పుడు ఆరోపణలు చేశారని, భవిష్యత్తులో తప్పుడు వ్యాఖ్యలు చేస్తే దేహశుద్ధి తప్పదని, రాళ్ళతో దాడి చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఆర్.కృష్ణయ్య ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని, ఏ పార్టీలో చేరలేదని, రాజకీయ పార్టీలే పిలిచి ఆయనకు పదవులు ఇచ్చాయన్నారు. ఆయనకు పలు రాజకీయ పార్టీలు పదవులు కట్టబెట్టడం ఓర్వలేక, అధికార పార్టీలకు అంటకాగుతూ జాజుల తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు.జాజుల మాత్రం రాజకీయ పార్టీలు, నాయకులతో కొమ్ము కాస్తు రాత్రిళ్ళు డబ్బుల సంచులు తెచ్చుకుంటున్నారని వారు ఆరోపించారు. ఆయనపై ఆరోపణలు రుజువు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు సవాల్ విసిరారు. జాజుల తక్షణమే ఆర్.కృష్ణయ్యకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక మీదట కృష్ణయ్యపై ఆరోపణలు చేస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## ఢిల్లీ జస్టిస్ వర్మను తక్షణమే అరెస్టు చేయాలి -వి.ఎస్.బోస్ డిమాండ్

**సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** ఢిల్లీ జస్టీస్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు ఆధారంగా తక్షణమే అతన్ని అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. వర్మకు నిజాయితీ, న్యాయ వ్యవస్థ మీద గౌరవం ఉంటే తక్షణమే పదవికి రాజీనామా చేసి విచారణ కమిటీకి పూర్తిగా సహకరించాలని కోరారు. అలా కాకుండా నేరం నుంచి తప్పించుకోవడానికి, తన మీద ఎవరో కుట్ర పన్నుతున్నట్లుగా ప్రకటనలు చేయడం, నోట్ల కట్టలకు తనకు ఏలాంటి సంబంధం లేదని చెప్పడం, అతని స్థాయికి, నిర్వహిస్తున్న పదవికి తగదన్నారు. వర్మ చేస్తున్న ప్రకటనలు రాజకీయ నాయకులు చేసే ప్రకటనలుగా ఉన్నాయని, దేశంలోని ప్రధాన న్యాయమూర్తి ప్రకటన భావనను ప్రతిబింబించడం లేదన్నారు. దేశంలో న్యాయం బ్రతకాలంటే ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించాలని, వెంటనే జస్టీస్ వర్మను పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్మపై విచారణ సక్రమంగా జరగకపోతే అందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, న్యాయ వ్యవస్థను చంపడానికి ప్రయత్నిస్తున్న వారిపై ప్రతిఘటించాలని, న్యాయవ్యవస్థను కాపాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## నిజాం కళాశాలలో వీర యోధుల వర్ధంతి


వీర యోధుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

**సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య కోసం పోరాడిన వీర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిజాం కళాశాల ప్రాంగణంలో పిడిఎస్‌యు హైదరాబాద్ జిల్లా అధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.దుబ్బ రంజీత్ మాట్లాడుతూ తమ యవ్వనంలో దేశం కోసం బ్రిటిష్‌వారిని గడగడ లాడించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగం మరువలేనిదన్నారు. స్వాతంత్ర్యం కోసం వారు తమ ప్రాణాలను ఉరికంబాన్ని ముద్దాడిన వీర యోధుల చరిత్ర చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, నాయకులు కె.శ్రీనివాస్, సంతోష్, గౌతం, రహీం, సాయికిరణ్, వంశీ, కిషోర్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు పండుగల సెలవులు ఇవ్వాలి : సిఐటియు


పారిశుధ్య కార్మికులకు పండుగల సెలవులు ఇవ్వాలని అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియూ నేతలు

**హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త**

పారిశుద్ధ్య కార్మికులకు పండుగల సెలవులు ఇవ్వాలని సిఐటియూ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రాములు, నగర సహాయ కార్యదర్శి సి.మల్లేష్‌లు జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 18,600 మంది మున్సిపల్ కార్మికులు పనిచేస్తున్నారని, ఎక్కువ శాతం మంది మహిళా కార్మికులు ఉన్నారని తెలిపారు. బోనాలు, దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, రంజాన్, క్రిస్మస్ లాంటి ముఖ్యమైన పండుగలకు మునిసిపల్ స్వీపర్స్‌కు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ఇళ్లల్లో పనులు చేసుకునేది మహిళలే కావున కుటుంబ సభ్యులు, పిల్లలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వీరంతా ఒంటరి మహిళలు, భర్త చనిపోయి విడోగా ఉన్న మహిళలు, భర్త ఉండి కూడా తాగుబోతు భర్తలుగా ఎక్కువ మంది ఈ సంస్థలో పనిచేస్తున్నారు, ఇతరులు పనిచేస్తున్నవారూ పేద మహిళలు, వీరికి ఇంటి దగ్గర పని చేయడానికి ఎవరు ఉండరు,కావున పండుగల సందర్భంగా అటెండెన్స్ తీసుకుని సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ కు వినతిపత్రం ఇచ్చి విజ్ఞప్తి చేయడం జరిగిందని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



విఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ, ఐఎన్టీయుసీ జాతీయ అధ్యక్షుడు జీ.సంజీవరెడ్డి తదితరులు

## అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి : జగదీశ్వర్‌గౌడ్


హాఫీజ్‌పేట్ డివిజన్‌లో ప్రజాసమస్యలను అడిగితెలుసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి,మార్చి 24 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లినియోజకవర్గంలోని అన్ని డివిజన్లను సమాజప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ ఐదోఫేజ్ అపార్ట్‌మెంట్ వద్ద పర్యటించి స్థానికంగా నెలకున్న సమస్యలను నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్:గౌడ్ పరిశీలించారు. జనప్రియ అపార్ట్‌మెంట్ లో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బి మేనేజర్ శ్రీదర్, స్థానిక ప్రజలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి కాలనీలో నెలకున్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని ప్రతి డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ దృష్టికి వచ్చే మౌళిక వసతుల సమస్యలను పరిష్కరిస్తామని, మౌళిక సదుపాయాల కల్పన కోసం అహర్నిశలు పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూర్తి,చిన్నబాబు,కోటేశ్వరరావు, ఆశోక్,జితేందర్‌సింగ్, మహిళలు జ్యోతిరెడ్డి, సత్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వెల్లువెత్తిన ఫిర్యాదులు



ప్రజావాణిలో భాగంగా వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి,మార్చి 24 ప్రభాతవార్త**

ప్రజావాణిలో ప్రజలు విన్నవించే ప్రతి సమస్యపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువెత్తాయి. జోనల్ కార్యాలయంతో పాటు శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్ గూడ,పటాన్‌చెరు సర్కిళ్లలో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాగా ఆయా విభాగాలకు చెందిన సమస్యలపై మొత్తం 25 వినతులు అధికారులకు అందాయి. ఇందులో జోనల్ కార్యాలయంలో 15,శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 4,యూసుఫ్‌గూడ సర్కిల్ కారా ్యలయంలో 2,చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 4 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్నువిభాగం,ఇంజనీరింగ్ విభాగాలకు సంబందించి సమస్యలను ప్రజలు వినతి పత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజావానిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు,యుద్ద ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని ఆయన సూచించారు. జోనల్ కార్యాలయంలోని ఆయా విభాగాల అధికారులు కూడా ప్రజావాణిలో పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో సెంట్రింగ్ కార్మికుడు మృతి

**గచ్చిబౌలి, మార్చి 24 ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో సెంట్రింగ్ కార్మికుడు మృతిచెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర పరిధిలోని ఔరత్‌కు చెందిన సతీష్ లక్ష్మణ్ తెలంగ్(36) బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి హాఫీజ్‌పేట్ పరిధిలో నివాసం ఉంటున్నాడు. సోదరుడు సోమనాథ్‌తో కలిసి సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గచ్చిబౌలిలో ఇర్ఫాన్ అనే కాం ట్రాక్టర్ వద్ద సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న సతీష్ లక్ష్మణ్ ఆదివారం మధ్యాహ్నం గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న భవనం ఐదవ అంతస్థులో పనులు చేపట్టాడు. కాగా రాడ్ కటింగ్ మిషన్ పట్టుకోగా, విద్యుత్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. దీంతో స్థానికులు వెంటనే సతీష్ లక్ష్మణ్‌ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ద్రువీకరించారు. ఈమేరకు సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆసుపత్రి అనుమతి రెన్యువల్ - కటకటాలపాలైన యజమాని

**నార్సింగి, మార్చి 24 ప్రభాతవార్త :** ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆసుపత్రి అనుమతిని రెనివల్ చేయించుకొని జిల్లా వైద్యాధికారులను బురిడీ కొట్టించి యజమానిని నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... గండిపేట మండలం నార్సింగికి చెందిన అలియమన్మ సబాస్టియన్ అరోన్ ఆసుపత్రిని నడిపిస్తుంది. ఈ ఆసుపత్రి అనుమతిని ఫోర్జరీ డాక్యుమెంట్లతో రెనివల్ చేయించుకుంది. ఈ విషయంను రంగారెడ్డి జిల్లా వైద్యాధికారులు గుర్తించారు. సదరు ఆసుపత్రి యజమానిపై చట్టపరిధిలో కఠినమైన చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆసుపత్రి యజమానిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. జిల్లా వైద్యాధికారులు త్వరలోనే ఈ అరోన్ ఆసుపత్రిని సీజ్ చేస్తారన్న చర్చ నడుస్తుంది.

## దేశానికి స్వాతంత్రం తెచ్చింది కాంగ్రెస్ : ఎమ్మెల్యే శ్రీగణేష్



జై సంవిధాన్ అభియాన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరా స రెడ్డి ఆధ్వర్యంలో సోమ వారం సోమవారం మట్‌పోర్ట్‌లో నిర్వహించిన జై బాపూ, జై బీమ్, జై సంవిధాన్ అభియాన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించింది అంబేద్కర్ అని, త్యాగాలకు ప్రతిరూపం కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాం తం మానవత్వం, త్యాగమన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కులగణన బీసీ రిజర్వేషన్లు ఎస్సీ స వర్గీకరణ లాంటి చరిత్రాత్మకమైన నిర్ణయాలు సిఎం రేవంత్ రెడ్డితోనే సాధ్యమైందన్నారు. ఈ కార్య క్రమంలో బీసీ కార్పోరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకురాలు అకాంక్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో అందరి సహకారం ఉండాలి -డిసిపి రష్మిపెరుమాల్



బోయిన్‌పల్లి మార్కెట్ సమావేశంలో మాట్లాడుతున ్న డిసిపి రష్మి పెరుమాల్, మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, దేవుడు తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కు అందరి సహకారం ఉండాలని ఉత్తర మండలం డిసిపి సాదన రష్మిపెరుమాల్ తెలిపారు. సోమవారం బోయిన్‌పల్లి మార్కెట్ శిక్షణా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో అతి పెద్ద బోయి న్‌పల్లి మార్కెట్‌లో అసాంఘిక కార్యక్రమాలకు, గంజాయి వంటి విక్ర యాలు జరిగితే ఎంతటివారినైనా సహించేదిలేదన్నారు. వాటిని ని యంత్రించేందకు హమాలీలు, మార్కెట్ సిబ్బంది, రైతుల సహకారం ఉంటే నేరాలను నియంత్రించవచ్చన్నారు. మార్కెట్ చైర్మన్ ఆర్. ఆనం ద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి వెంకన్న, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ (దేవుడు), సికింద్రాబాద్ వెజిటేబుల్ ఏజెం ట్ కమీషన్ అసోసియేషన్‌అధ్యక్షుడు సోమదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఈద్గా ఏర్పాట్లను పరిశీలించిన జంపనప్రతాప్


బోయిన్‌పల్లిలో ఈద్గా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త:** ముస్లిం సోదరులు నెల రోజుల కఠిన ఉపవాసాలు ఆచరించి రంజాన్ పండుగను జరుపుకుంటారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సోమవారం బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్‌లోని ఈద్గా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీలు ఈద్గాలో సామూహిక ప్రార్ధనలు జరుగుతాయి, అందు వల్ల ఈద్గా పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని బోర్డు సిబ్బందికి, పారిశుధ్య సిబ్బందికి తెలియజేశారు. అదే విధంగా తాగునీరు వసతి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిక్ మౌలా, బోర్డు సూపర్ వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయ్ శత జయంతి వేడుకలు విజయంతం చేయాలి : బిజెపి


అడ్డగుట్ట బిజెపి సమావేశంలో పాల్గొన్న నాయకులు నాగేశ్వర్ రెడ్డి, శారధ మల్లేశ్, గాజుల సౌందర్య తదితరులు

**అడ్డగుట్ట, మార్చి 24 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని హటల్ బిహారి వాజ్‌పేయ్ శత జయంతి ఉత్స వాలను పురస్కరించుకొని సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి బిజెపి జిల్లా అధికార ప్రతినిధి శారధ మల్లేశ్, కో-కన్వీన ర్ నాగేశ్వర్ రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక జరిగితే వచ్చే ప్రయోజనాలను వివరించారు. అడ్డగు ట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య అధ్యక్షతన జరిగిన ఈ స మావేశంలో బిజెపి సీనియర్ నాయకులు క్రిష్ణ, నర్సింగ్‌రావ్, రాజారా మ్, హంసరాజ్, దిలీప్, రాజు, శ్రావణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## అంకితభావంతో సమాజసేవ చేయాలి



సమాజసేవకులను టిబిఆర్ ఐకాన్ అవార్డులతో సత్కరిస్తున్న పృధ్వీరాజ్, వెంకటాచారి, అశోక్‌కుమార్, సంగిశెట్టి, నరసింహారావు, రాకేష్ తదితర అతిథులు

**నాంపల్లి, మార్చి 24 ప్రభాతవార్త :** సమాజసేవ అనేది ఎంతో గురు తుల్యమైన బాధ్యతని, ఈ సేవ దైవానికి చేసే సేవవంటిదేనని ప్రముఖ సినీనటుడు డా. పృధ్వీరాజ్ అన్నారు. సమత గోపాల్ కళానిలయం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ (టిబిఆర్) సంయుక్త ఆధ్వర్యంలో సమాజసేవలో తమ జీవితాన్నే అంకితం చేస్తున్న పలువురు ప్రముఖు లకు టిబిఆర్ ఐకాన్ 2025 అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. టిబిఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చింతపట్ల వెంకటాచారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పృధ్వీరాజ్, శంఖారావం ఫేమ్ డా. కొండ నరసింహారావు, జబర్దస్త్ ఫేమ్ రాకింగ్ రాకేష్, సమతా గోపాల్ యాదవ్, కామెడీ కింగ్ డా. గురుస్వామి తదితరులతోపాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్యూరీ కమి టీ సభ్యులు డా. టీవి అశోక్‌కుమార్, డా. సంగిశెట్టి, రాయుడు చంద్ర, సిరిమువ్వ శ్రీనివాస్, చింతపట్ల సాయిబాబా, విష్ణుచారి విశ్వ జ్యోతిలతో కలిసి సామాజికసేవలో విశేష కృషిచేసిన పలువురు వ్యక్తుల ను ఎంతగానో గౌరవిస్తూ టిబిఆర్ ఐకాన్ అవార్డులను ప్రదానం చేసి ముమ్ముందు తమ సేవలను కొనసాగిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలవాల ని కోరారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రము ఖ గాయకులు లక్ష్మీశాంతి, శోభా, మాల్యాద్రి, మధుసూదనరావులు తమ సుమధుగానంతో ఆహుతులకు వీనులవిందు కావించారు.

## శ్రీసంగమేశ్వరస్వామి దేవాలయంలో విశ్వావసు నామ సంవత్సర వేడుకలు

**నాంపల్లి, మార్చి 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్ కొలువై ఉన్న అతిపురాతన శ్రీసంగ మేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామివార్ల దేవాలయం లో తెలుగుజాతి నూతన సంవత్సరం విశ్వావసు నామ సంవత్సరం శుభసందర్భంగా 30వ తేదీ ఆదివారం ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీ సంగమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకములు, రాత్రి 6గంటలకు పంచాంగ శ్రవణం; ఏప్రిల్ 7వ తేదీ సోమవారం వరకు శ్రీ పార్వ తీ అమ్మవారికి వసంత నవరాత్రులలో ప్రతీరోజూ ఉద యం 8గంటల సహస్రనామం, రాత్రి 6గంటలకు కుం కుమార్చనలు; ఏప్రిల్ 6వ తేదీ గురువారం శ్రీరామనవమి సందర్భంగ ఉదయం 10.30 గంటల నుండి వేదపండితులు, అర్చకస్వాములచే వేదమంత్రా లతో భక్తజన సమక్షంలో భాజీభజంత్రీలతో పూలపంది రిలో శ్రీ కోదండరామ చంద్రస్వామికి, శ్రీ సీతాదేవికి కన్నులపండువగా కళ్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం, రాత్రి 7గంటలకు రథోత్సవములు; ఏప్రిల్ 12వ తేదీ శనివారం శ్రీ హనుమజ్జయంతి సందర్భంగా


శ్రీసంగమేశ్వరస్వామి దేవాలయం

శ్రీ ఆంజనేయస్వామివారికి ఉదయం 5గంటల నుండి పంచామృత అభిషేకము, సింధూర అలంకరణ, సహస్రనామ ఆకుపూజ, అష్టోత్తర శతనామాది పూజా కార్యక్రమాలు, ఉదయం 10గంటలకు మన్యుసూక్త హోమం తదితర పూజాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరుపబడతాయని దేవాలయ కార్యనిర్వహణాధికారి పి. లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయా వేడుకలకు అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

## సిల్వర్‌ఓక్స్‌లో ఐబిడిపి, ఎంవైపి బ్యాచ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న విద్యార్థులు

**దుండిగల్, మార్చి 24 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం భౌరంపేటలోని సిల్వర్‌ఓక్స్ ఇంట ర్నేషనల్ పాఠశాలలో ఇంటర్నేషనల్ బకలారియేట్ డిప్లొమా(ఐబిడిపి), మిడిల్ ఇయర్స్ ప్రోగ్రామ్(ఎంవైపి) లను అందుబాటులోకి తీసుకువచ్చింది. మొదటి బ్యాచ్ ను సోమవారం విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ డా.రచనశర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ, ఆధునిక బోధనలను అందించేందుకు ఐబిడిపి, ఎంవైపి లను అందుబాటు లోకి తీసుకువచ్చామన్నారు. దేశవ్యాప్తంగా 50పాఠ శాలలో మాత్రమే ఐబిడిపి, ఎంవైపి తరగతులు ఉన్నా యని తెలిపారు. ఐబి ఎడ్యుకేషన్ సిస్టమ్ అనేది పూర్తిగా భిన్నమైనదని దీని ద్వారా విద్యార్థులు మరింత రాణించగలరని పేర్కొన్నారు. వివిద అంశాలపై పరిపూ ర్ణమైన అవగాహన కలడంతో పాటు ఆలోచనశక్తి మెరు గుపడుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎడ్యుకేష న్ డా.సీతామూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ వి.ధనుంజయ, రెసిడెన్షియల్ డైరెక్టర్ నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ నాగేష్.

**బేగంపేట మార్చి24, ప్రభాతవార్త**

రానున్న రోజుల్లో విధ్యావిధానం పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరిగే అవకాశం ఉందని, కాబట్టి విధ్యార్థులం దరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆధునిక విధ్యావిధానంలో వాటి ఉపయోగాలు తెల్సు కోవాలని ప్రొఫెసర్ బి.నాగేష్ అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జాగ్రఫీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ. డిపార్ట్ మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీఆధ్వర్యంలో ద డిజిటల్ షిఫ్ట్ నావిగేటింగ్ ఇన్నోవేషన్స్ ఇన్ ఆన్లైన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ కార్య క్రమాన్ని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.కె.పద్మావతి మాట్లాడుతూ నేటి తరం విధ్యార్థినీ విధ్యార్థులు అంద రూ డిజిటల్ టూల్స్‌ను విధ్యావిధానంలో అనుసరిం చాలని సూచించారు. భవిష్యత్‌లో రానున్న విధ్యా విధా నంలో ఆన్లైన్ డిజిటల్ టూల్స్‌కి ప్రాధాన్యత ఉంటుం దని అన్నారు. మారుతున్న మార్పులకు అనుగుణంగా విధ్యార్థినులు అందరూ ఆధునిక పరిజ్ఞానాన్ని అలవ ర్చుకొని విషయ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొం దించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన రఘుపతి విధ్యా విధానంలో పురాతన కాలం నుంచి నేటి వరకు గురుకుల విధ్యావిధానం నుంచి ఆధునిక విధ్యావిధానం వరకు వచ్చిన మార్పులను గురించి విధ్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పాల్ టి.భాస్కరరెడ్డి, అనిశరణ్, డా.కమల, డాక్టర్ నాన్సీ సెరేనా, డా.నిర్మల, డా.జి.నర్సింహులు, బాల్‌రెడ్డి, విజయరాఘవి.శివానుజ, విద్యార్థులు పాల్గొన్నారు

## రచనా నైపుణ్యం పై సర్టిఫికెట్ కోర్సు



-కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రభు తదితరులు

**చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త:** విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ర విభాగం అధ్యక్షుడు డా. డి. కుమారస్వామి అధ్యక్షతన "రైటిం గ్ స్కిల్స్ ఫర్ ప్రొఫెషనల్ గ్రోత్" అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపల్ డా.కె.ప్రభు పాల్గొని ప్రసంగిస్తూ అభివ్యక్తి నైపుణ్యాలైన వినడం, మాట్లాడడం, చదవడం, రాయడంలో సృజనాత్మకత తోరాయడం అనేది ముఖ్యమైదని, ఈ నైపుణ్యం వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు, విజయవంతమైన ఉద్యో గ జీవితాన్ని కొనసాగించవచ్చని, జర్నలిజం, రచనా రంగంలో కూడా రాణించవచ్చని, సర్టిఫికేట్ పొందడం తో పాటు సామాజిక బాధ్యత కూడా విద్యా ర్థులకు అలవడుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధానాచార్యులు వెంకట ఈశ్వర్, డా. ఆర్. లావణ్య, అధ్యాపకులు డా. ముక్త వాణి, రాజశేఖర్, డా.అనురాధ, డా.బాణాల శ్రీని వా స్, డా.యాదగిరి, కె. నీరజ, వీరాల సంతోషి, ఇర్ఫాన బేగం, తస్నీమ్ జహన విద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్, ప్రియాంక గాంధీ సేనను మరింత బలోపేతం చేస్తాం


నియామక పత్రాలు అందిస్తున్న రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్‌ఫయాజ్.

**బేగంపేట మార్చి 24, ప్రభాతవార్త**

రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్)ను జిల్లాల వారీగా మరింత బలోపేతం చేస్తున్నామని రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మహ్మద్ ఫయాజ్ అన్నారు. సోమవారం బేగంపేట పాటిగడ్డలోని కార్యాలయంలో 25మందికి వివిధ హోదాల్లో నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) కు ఇప్పటికే వివిధ జిల్లాల్లో కమిటీల నియా మకం పూర్తి చేసామన్నారు. అలాగే జంట నగరాల పరిధిలో కూడా వివిధ నియామకాలు చేస్తున్నా మన్నా రు. సోమవారం నాగోల్ ఉపాధ్యక్షురాలిగా చింతల రాధిక, నాగోల్ ప్రధాన కార్యదర్శిగా జ్యోతి బండ , వడ్లమూడి శ్రీదేవి, అర్రశ్రావణి, వడ్లమూడి ప్రేమ్‌కుమా ర్, అర్ర వసంత, నాగమణి, విజయ్‌కుమార్, జి.రజిత, అనూష కూనం, వాసుదేవరెడ్డి, మహేష్‌లతో పాటు మరి కొందరిని వివిధ పోస్టులలో నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నూతనంగా బా ధ్యతలు స్వీకరించిన వారు మాట్లాడుతూ తమకు అప్ప గించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తామని, తమ పరిధిలో రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్)ను మరింత బలోపేతం చేస్తామన్నారు.

## చార్మినార్‌లో జోరుగా ఇఫ్తార్ విందులు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ సెట్విన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, కాంగ్రెస్ నాయకులు ముజీబుల్లా షరీఫ్, కె.రవిరాజ్ తదితరులు

**చార్మినార్, మార్చి 24 ప్రభాతవార్త :**

పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గంలో రంజాన్ మాసం సందర్భంగా జోరుగా ఇఫ్తార్ విందులు జరుగుతు న్నాయి. రంజాన్ పండుగ సమీపిస్తుండటంతో చార్మినా ర్, గుల్జారాహౌస్, కాలీకబర్, హుస్సేనీఆలం, పురానా పూల్, శాలిబండ, కాజీపురతో పాటు పలు ప్రాంతాలలో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందులను ఏర్పా టు చేస్తున్నారు. కాగా సోమవారం రాత్రి చార్మినార్ సమీపంలోని గుల్జారా ఫంక్షన్ హాల్‌లో మహమూద్ అబ్దుల్ సలాం కుమారులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సెట్విన్ చైర్మన్ మీర్ ఇనా యత్ అలీ బాక్రీ, బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ అబ్దు ల్ లతీఫ్ షర్వాన్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జిముజీబుల్లా ఫరీప్, యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి రవిరాజ్‌లు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా సాంబమూర్తిని నియమించాలి

-మాల మహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు హసేన్

**చిక్కడపల్లి, మార్చి 24 ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా చింత సాంబమూర్తిని నియ మించాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది తల్లమల్ల హసేన్ డిమాండ్ చేశారు. దక్షిణ భారత దేశంలో బిజెపి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 40 సంవత్సరాల క్రితమే నల్లగొండ మున్సిపల్ చైర్మన్ గా పనిచేశారని, పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులుగా సేవలను అందించి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన చింత సాంబమూర్తిని పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియామకం చేయాలని బిజెపి పార్టీ కేంద్ర నాయకత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో క్రమశిక్షణ గల సైనికుడిలా పార్టీలోఅనేక సేవలను అందించిన చింత సాంబ మూర్తి, అన్ని వర్గాల అభిమానాన్ని పొందిన గొప్ప నాయకుడని, ఆయన సేవలను గుర్తించి బిజెపి పార్టీ అన్ని విధాల ప్రోత్సహించి ముందుకు నడిపించాలని కోరారు.

## బిజెపి నగర కార్యాలయంలో రక్తదాన శిభిరం

**హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** బిజెపి హైదరా బాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బిజెపి నగర కార్యాలయంలో కార్యకర్తలు రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి, ఉపాధ్య క్షుడు చింతల రామచంద్రారెడ్డి, కార్పోరేటర్ ఉమార మేష్‌యాదవ్, నాయకులు కృష్ణగౌడ్, అజయ్, సూర్య ప్రకాష్‌సింగ్, వనం రమేష్, కిలారి మనోహర్, ప్రశాంత్, ప్రేమ్, రమేష్‌యాదవ్, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, యశ్వంత్, అవినాష్, చిక్రి, గణేష్, మనోజ్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ ఖిల్లా పై కాషాయ జెండా ఎగరేద్దాం : ఉమా మహేందర్

**మెహిదీపట్నం, మార్చి 24, ప్రభాతవార్త :** గోల్కొండ ఖిల్లా పై కాషాయ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి నాయ కుడు, కార్యకర్త పనిచేయాలని బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాత పట్టణంలో మజ్లిస్ పార్టీని ఓడించే సత్తా ఒక్క బిజెపికి మాత్రమే ఉందన్నారు. సోమవారం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు తాళ్ల రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భవన్ లో డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా ఉమా మహేందర్, బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఠాకూర్ అమర్ సింగ్ లు హాజరై భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసిన అనం తరం మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి ని పూర్తిగా అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రజా ప్రతిని ధులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలకే పరిమితం అవుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ పర్యటనలు మానుకొని తెలంగాణ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇక హైదరాబాద్ నగరంలో ఎంఐఎం పార్టీ అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి వంత పాడుతూ తమ పబ్బం గడుపుకుం టున్నారని, అట్టి పార్టీని హైదరాబాదు నుంచి తరిమి


సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు.

యాల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ పాత పట్టణం అభివృద్ధి చెందకపోవడానికి ఎంఐఎం పార్టీఏ కారణమని విమర్శించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధి కారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గోల్కొం డ ఖిల్లా పై కాషాయ జెండా రెపరెపలాడేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సునీల్ యాదవ్, ఆకాష్ సింగ్, వెంకటేష్ జోషి, మల్లేష్ యాదవ్, పెంజర్ల శ్రీనివాస్, రామకృష్ణ చారి, అంబిక సాగర్, యాదగిరి, మామిడి వెంకటేష్, గొడుగు గణేష్ ముది రాజ్, దాస్, రామకృష్ణ సాగర్, మనోజ్, సచిన్ కమలేకర్, విక్రమ్ సింగ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిసి హక్కుల సాధనకు కృష్ణమోహన్‌రావు కృషి అమోఘం

-విశ్రాంత ఐఎఎస్ అధికారి అశోక్‌కుమార్



డా. లోహియా సామాజికన్యాయ అవార్డుతో వకుళాభరణంకృష్ణమోహన్‌రావును సత్కరిస్తున్న అశోక్‌కుమార్, ఆదినారాయణ, మూర్తి తదితర ప్రముఖ ప్రొఫెసర్లు

**నాంపల్లి, మార్చి 24 ప్రభాతవార్త :** వెనుకబడిన తరగతుల వారి హక్కుల సాధనకు డా. వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు చేస్తున్న కృషి అమోఘం అనితరసాధ్యమని విశ్రాంత సీనియర్ ఐఎఎస్ అధికారి జి.అశోక్‌కుమార్ అన్నా రు. నేను తెలంగాణ బిసి సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నప్పుడు ఆయన పనితీరును దగ్గరగా చేశానని, వకుళాభరణంకు ప్రతిష్టాత్మక ప్రథమ డా. లోహియా సామాజిక న్యాయ అవా ర్డుకు ఎంపిక చేయడం హర్షదాయకమ ని, ఈ పురస్కారానికి ఆయన పూర్తిగ అర్హుడని అన్నారు. న్యూఢిల్లీలోని రాజా రామ్‌మోహన్‌రాయ్ మెమోరియల్ హాల్‌లో ఆదిశీలా ఫౌండేషన్ ఆధ్వర్యం లో సంస్థ ఫౌండర్ ఛైర్మన్ డా. ఎస్. ఆదినారాయణ నేతృత్వంలో నేత్రపర్వం గా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిది గా పాల్గొన్న అశోక్‌కుమార్ ప్రముఖ అతిథులు పివిఆర్.మూర్తి, ప్రొఫెసర్లు డి.పి.మిశ్రా, ఉపేంద్ర, యోగేష్‌కుమార్, రవికుమార్, సుప్రీంకోర్టు న్యాయవాది వినోద్ బిందురు తదితరులతో కలిసి డా. వకుళాభరణంను ఘనంగా సత్క రించి డా. లోహియా సామాజిక న్యాయ పురస్కారాన్ని, పురస్కారంతోపాటు లక్షాపదిహేనువేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. అనేక ప్రమా ణాలను సునిశితంగా పరిశీలించి ప్రథ మంగా అందిస్తున్న ఈ అవార్డుకు కృష్ణ మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎంపికచేసి నట్లు, ప్రతీ సంవత్సరం లోహియా జ యంతి రోజు అందజేయనున్న అవార్డు కు జాతీయస్థాయి గుర్తింపు లభించేలా నగదు బహుమతి కూడా అందజేస్తున్న ట్లు సంస్థ ఛైర్మన్ ఆదినారాయణ వివరిం చారు. చివరిగా తన స్పందనలో డా. వకుళాభరణం సామాజిక న్యాయసాధనే జీవితలక్ష్యంగా కృషిచేసిన మహనీ యుడు డా. రామమనోహర్ లోహియా అని, ఆయన పేరిట పురస్కారం అందు కోవడం చాలా గౌరవంగా ఉందని అన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతి సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృ తిక సమానత్వం సాధించడమే లోహి యా ఆశయమని, ఆయన చూపినమా ర్గంలో నడవడం ప్రతీ సామాజిక కార్య కర్త బాధ్యతన్నారు. సభకుముందు డా. రామమనోహర్ లోహియా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన అనంతరం లోహియా సమానత్వ సి ద్ధాంతం అంశాన్ని ప్రబోధించేలా ప్రత్యేక సాంస్కృతిక నత్యరూపకాలు, హిందీ నాటక ప్రదర్శనలు కనువిందుగా జరిగి ఆహుతులకు గొప్ప సందేశాన్ని అందించాయి.

## అంతర్జాతీయ ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం యువతతోనే సాధ్యం : మాజీ మంత్రి మల్లారెడ్డి

**కుత్బుల్లాపూర్, మార్చి 24 ప్రభాతవార్త**




ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని శాసించే స్థాయికి భారతీయ యువత మాత్రమే పోటీతత్వంలో ముందున్నారని మేడ్చెల్ శాసన సభ్యులు, మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత చామకూర మల్లారెడ్డి అన్నారు. చింతల్ హెచ్ఎంటి కాలనీలోగల వాక్సన్ ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రథమ వార్శికోత్సవానికి ముఖ్యఅతిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల చైర్మెన్ అల్వాల వనజాఅశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నిరంతర శ్రమ, ప్రణాళికాబద్ధమైన కృషి తోడైతే విజయాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. 49సంవ త్సరాల క్రితం సైకిల్, రెండు పాలక్యాన్లతో ప్రారంభమైన తన జీవితం నేడు భారతదే శంలోనే అత్యంత ఎక్కువవిద్యార్థులకు విద్యనందించే విద్యాసంస్థగా రూపుదిద్దుకోవడం వెనక ఎంతో కృషి వుందన్నారు. తనకు ఇంతపెద్దస్థాయిలో విద్యాసంస్థలు ఉన్నా వాక్సన్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌కు ఉన్న ఆధునిక వసతులు అన్ని కలగలిసి లేవని మెచ్చుకున్నారు. అంతర్జాతీయ టేబుల్‌టెన్నిస్ క్రీడాకానిణి నైనా జైస్వాల్ మాట్లాడు తూ కేవలం ఎనమిది ఏళ్లవయస్సు కే తాను పదవ తరగతి పాస్‌కావడంతో పాటు కేవలం 22 సంవత్సరాలతోపే ఇంటర్, డిగ్రీ, రెండు పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులను పూర్తిచేసి ప్రపంచంలోనే తక్కువ వయస్సులో పిహెచ్‌డితో డాక్టరేట్ పొందిన విద్యార్థి గా గుర్తింపు పొందినట్లు తెలిపారు. భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి మాధమి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధనకోసం నిరంతరం కృషిచేసి విజయవంతమైన వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ట్రస్మా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ ప్రణాళికాబద్దంగా కృషిచే స్తూనే పోటీప్రపంచానికి ధీటుగా ఎదిగిన వాక్సన్ ఇంటర్‌నేషనల్ హైస్కూల్ చైర్మెన్ ఎ. వనజా అశోక్, డైరెక్టర్లు నవీన్‌రెడ్డి సంతోశ్‌పాటిల్ బృందానికి అభినందనలు తెలిపారు. వాక్సన్ ఇంటర్‌నేషనల్ హైస్కూల్ చైర్మెన్ అల్వాల వనజాఅశోక్ మాట్లాడు తూ మొదట జగద్గిరిగుట్టలో అశోక్ మెమోరియల్ పాఠశాలను చిన్నస్థాయిలో ప్రారం భించి విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షణతో తమపాఠశాల అంచెలంచెలుగా గుర్తింపు పొందిందన్నారు. సమావేశంలో జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, పుప్పాల బాస్కర్, వాక్సన్ ఇంటర్‌నేషనల్ హైస్కూల్ డైరెక్టర్లు నవీన్‌రెడ్డి, సంతోష్ పాటిల్ , ప్రిన్సిపల్ రేష్మాబేగం తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే విశేష కృషి : కార్పొరేటర్లు

**అల్వాల్, మార్చి 24 ప్రభాతవార్త:**



మీడియా సమావేశంలో కార్పొరేటర్లు

అల్వాల్ సమగ్రాభివృద్ధికి ఇటీవల కాలంలో మం జూరైన అనుమతు లు, నిధులు నిదర్శనమని అల్వాల్ సర్కిల్ బిఆర్ఎ స్ కార్పొరేటర్లు పేర్కొ న్నారు. సోమవారం అల్వాల్ పార్టీ కార్యాల యంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో పాటుగా ఇతర సీనియర్ నేతలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సాధించిన విజయాలను వివరించారు. అల్వాల్‌కు ప్రత్యేకంగా అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయడంలో ఎమ్మెల్యే కీలకంగా వ్యవహరించిన నేపథ్యంలో పోలీసు స్టేషన్ పక్కన ఉన్న 11 గుంటలు స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. 9.82లక్షలు నిధులతో ఐజి సర్కిల్ అభివృద్ధి, 50లక్షలు వ్యయంతో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 4.50లక్షలుతో సింగిల్ ఫేజ్ నుంచి త్రీఫేజ్‌కు విద్యుత్ లైన్లు మార్పు, ఇతర అభివృద్ధి పనులకు మొత్తం 119.32 నిధులు మంజూరు అయ్యాయని వివరించారు. సిసి రోడ్ల ఏర్పాటుకు సుమారుగా 5.50లక్షలు నిధులు సిద్దంగా ఉన్నాయని తెలిపారు. బిహెచ్ఇ ఎల్ క్వార్టర్స్, వెస్ట్ వెంకటాపురం, బొల్లారం, తుర్కపల్లి ప్రాంతాలులోని రైల్వే గేట్లు వద్ద అండర్ పాస్, ఫ్లైఓర్ ఏర్పాటుకు సంబంధించి నిధులను మంజూరు చేయించిన ఘతన ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పనులకు ఆమోదం తెలిపిన వాటికి నిధులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంజూరు చేయిం చారని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే చిత్త శుద్దితో పని చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నేతలు డోలి రమేష్, అనీల్ కిషోర్, శ్రీనివాస్, పరమేష్, నరేందర్ రెడ్డి, శోభన్, ప్రేమ్, మోసిన్ పాల్గొన్నారు.

**FORM NO.2 SUMMONS FOR SETTLEMENT OF ISSUES IN THE COURT OF XX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS AT HYDERABAD O.S.NO. 982 OF 2025**

Between
**Urmila Jhawar & others** ...Plaintiffs
And
**The Tahsildar and All concerned** ...Defendants
To
**All concerned**

Whereas plaintiffs has instituted a suit against you for declaration to declare that the plaintiffs are the Legal Heirs of Deceased Jhawar Jagdish Prasad and you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall accompanied by same person able to answer all such question on the 8th day of April, 2025 at 10-30 clock.

Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

By Order of Court

**Sd/- DAMODAR MUNDRA, DINESH K GILDA, G VENKATESH, MAYUR MUNDRA SHEYA MUNDRA, DIVYA MUNDRA**
**Advocates**
102, II Floor, KGN Plaza, Street No.8, Himayatnagar, Hyderabad.
**Cell No.9848080435**

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, AT ERRAGADDA, HYDERABAD. ARBITRATION CLAIM PETITION NO. 436 OF 2024**

BETWEEN:
**M/S VARADAYANI CHIT FUND PRIVATE LIMITED.** Ameerpet, Hyderabad. ...Disputant
Vs
**Mrs. M.Anuradha & Others** ...Opponents
To
**1. Smt. M. Anuradha,** W/o. M. Anand Sekhar, Aged about Major, Occ: Housewife, R/o. H.No.5-2-354/P, 128SP & P129, Gayathrinagar, Bank Colony, Vanastalipuram, Hyderabad-70.
**2. Sri. M. Anand Sekhar,** S/o. M. Narayana, Aged about Major, Occ: Head Constable, PC No.722, O/o. IG, SIB, Greenlands, Begumpet, Hyderabad-16. H.No.5-2-354/P, 128SP & P129, Gayathrinagar, Bank Colony, Vanastali puram, Hyderabad-70.
**3. M. Ravinder Reddy,** S/o. M.Konda Reddy, Aged about Major, Occ: Police Constable, OC.No.526, SP, Mahaboob nagar - 509001. R/o. Plot.No.34, Bhagiratha Colony, Mahaboobnagar-509001.
**4. Sri. M. Raju,** S/o. M. Laxmaiah, Aged about Major, Occ. Police Constable, PC.No.459, Special Intelligence Branch, Greenlands, Begumpet, Hyderabad-16. R/o. H.No.1-100, Ramanakkapet, Mangapet, Jayashankar Bhupalapally District-506172, C/o. H.No.8-438/6, G Floor, East Balaji Hills, Boduppal, Hyderabad-500092 ...OPPONENTS

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of **Rs.10,51,721/-.** The above claim petition is posted to dated **15-04-2025** for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at **12.00 A.M.** On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

"BY ORDER"
(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)
**B. Sandhya Naga Padma**
**Advocate**
H.No.8-3-945/8/9/106-B, 1st Floor, Pancom Business Centre, Opp: Chennai Shopping Mall, Ameerpet X Roads, Yellareddyguda, Hyderabad-500073

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

-ఎంబిటి అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంబిటి అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్ తదితరులు

**మలక్ పేట, మార్చి 24, ప్రభాతవార్త:** మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని ఎంబిటీ అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్ పేర్కొన్నారు. మోయిన్ బాగ్ లో సయ్యద్ సిరాజ్, సయ్యద్ ఖలేద్, సయ్యద్ రహమత్, సయ్యద్ ఆబెద్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్స వాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం : కార్పొరేటర్



కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ,తదితరులు

**మలక్ పేట ,మార్చి 24 ప్రభాతవార్త:** ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ముసారాంబాగ్ డివిజన్ కృష్ణ తులసి నగర్ కమ్యునిటిహాల్లో కృష్ణ తులసి సొసైటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కరాటే ఆత్మరక్షణ శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కృష్ణ తులసి నగర్లో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. బాల, బాలికలందరూ వేసవి సెలవుల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు నవీన్ నాయక్, రాజు గౌడ్, సొసైటి సభ్యులు విశ్వనాథం, ప్రవీణ్, నగేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో కార్పొరేటర్



**నేరేడ్ మెట్, (మోలాలి) మార్చి 24.ప్రభాతవార్త :** మోలాలి డివిజన్ భరత్ నగర్ లోని శ్రీ పెరుమాళ్ళ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్స వం వేడుకలు నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్స వానికి ముఖ్యఅతిథిగా మోలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ హాజరై స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆలయాన్ని ఇంత అద్భుతంగా తీర్చిదిద్దినందుకు ధన్యవాదాలు తెలుపుతూ అభినందనలు చెప్పారు. తాను కార్పొరేటర్ అయిన ట్టు ప్రకటించగానే తన అనుచరులతో కలిసి మొదటగా దర్శనం చేసుకున్నది ఈ ఆలయాన్నే అని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు .అప్పుడు ఆలయం చాలా దయనీయ స్థితిలో ఉందని, ఆలయాన్ని అద్భుతంగా రూపు దిద్దుకోడానికి ముందుకు వచ్చిన దాతలకు, ఆలయం కోసం కష్టపడ్డ కమిటీ సభ్యులకు, అలాగే ప్రతిరోజు ఆలయానికి వస్తున్న భక్తులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు . ఆలయ అభివృద్ధితోపాటు భరత్ నగర్, శ్రామిక నగర్ నెహ్రూ నగర్, గణేష్ నగర్ కాకుండా మోలాలిలోని అన్ని కాలనీలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని ,గత నాలుగు సంవత్స రాలుగా అది ప్రజలంతా చూస్తున్నారని ఈ సందర్భంగా కార్పొరేటర్ అన్నారు. కమిటీ సభ్యులకు అలాగే ధాతలకు అందరికి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ సన్మానం చేశారు. కమిటీ చైర్మన్ శంకర్ , మహేందర్ , లోకేష్ , ఎల్లం ,రాజేష్ యాదవ్ ,కిరణ్ కుమార్ , భాస్కరాచారి, రాందాస్ పాల్గొన్నారు.

## వ్యాపార లైసెన్స్ పునరుద్దరించుకోండి

### -కమిషనర్ అమరేందర్ రెడ్డి

**తుర్కయంజాల్ మార్చి 24,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని వ్యాపారులంతా సకాలంలో వ్యాపార లైసెన్సులు చెల్లించుట ద్వారా పురాభివృద్ధికి సహకరించాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 202425 ఆర్థిక సంవత్సరం వ్యాపార లైసెన్సులు చెల్లించని వారు త్వరగా చెల్లించాలని కోరారు. అదేవిధంగా వ్యాపార లైసెన్సులను వ్యాపారు లంతా పునరుద్ధరించుకోమని, 202526 ఆర్థిక సంవత్సరం వ్యాపార లైసెన్సులను ముందస్తుగా అంటే 2025 మార్చి 31వ తేదీ లోపు చెల్లించాలని కోరారు, లేని యెడల 25 జరిమానా తప్పదన్నారు. సకాలంలో వ్యాపార లైసెన్సులను చెల్లించడం ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని, తద్వారా పురపాలక సంఘం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ జవాన్ శివ తదితరులు పాల్గొన్నారు

## డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కార్పొరేటర్



**నేరేడ్ మెట్, మార్చి 24,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి డివిజన్ ను మాడల్ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. సోమవారం మల్కాజ్గిరి డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్, న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరేడ్మెట్ లలో కార్పొరేటర్ శ్రవణ్ పాదయాత్ర చెపట్టారు.ఈ సందర్భంగా భగత్ సింగ్ నగర్ రోడ్డు పూర్తి చెయ్యాలని, కమ్యూనిటీ హాల్ వెంటనే ప్రజలకు ఉపయోగంలోకి తీసుకు తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.న్యూ విద్య నగర్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు.రోడ్ల స్వీపింగ్ అధ్వానంగా ఉండటం పట్ల ఏ. ఎం. ఓ. హెచ్ మంజుల తో అసంతృప్తి వ్యక్తం చేసారు.రోడ్లపై, ఖాళీ ప్రదేశాలలో ఆకాతాయిలు చేరి గంజాయి తాగుతున్నరన్నా కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు, నేరేడ్మెట్ ఎస్. ఐ రమేష్ కు ఫోన్ చేసి చెర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే ఓల్డ్ నేరేడ్మేట్ లో నిమిగిలిన సందులలో భూగర్బ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వీధి దీపాల పట్ల శ్రద్ధ వహించాలని ఏ. ఈ వెంకటేష్ కు సూచించారు.లూస్ గా ఉన్న వైర్లు, పోల్స్ పై చెర్యలు తీసుకోవాలని కరెంట్ డిపార్మెంట్ వారిని కోరారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు నందు యాదవ్,శ్రీదేవి, సంతోష్, మురళి గౌడ్, ఆకారం సాయి,మాధవ్, సతీష్, శంకర్, రమేష్, వంశీ, శ్రీలక్ష్మి, అపర్ణ, జ్యోతి మరియు పెద్ద ఎత్తున బస్తీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించాలి: ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ

**మలక్ పేట,మార్చి 24, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించుకోవాలని మలక్ పేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ పేర్కొన్నారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా సేఫ్ వాటర్ నెట్ వర్క్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు నీటి సంరక్షణ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, సేఫ్ వాటర్ నెట్ వర్క్ ఇండియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ లు మాట్లాడుతూ... నీటి సంరక్షణ మన అందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు నీటిని అందించడానికి నీటి సంరక్షణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లలో మొట్టమొదటిది నీటి సమస్య అని, భారత దేశ అభివృద్ధికి ప్రధాన కారణమైన వ్యవసాయ రంగం మరియు పారిశ్రామిక రంగం మరియు ప్రజల యొక్క త్రాగునీటి అవసరాలకు సరిపడా నీరు దేశం లోపల లేనందున రోజురోజుకు నీటి సమస్యలు అధికమవుతున్నాయని, ఈ సమస్యను అధికమించడానికి సమాజంలో పౌరులందరూ నీటి సంరక్షణ పద్ధతులు పేర్కొన్నారు. గృహాలలో తప్పనిసరి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని సద్వినియోగపరిచే పద్ధతులను పాటించాలని, నీటి వృధాని అరికట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మల, సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా ప్రతినిధులు జితేందర్ యాదవ్,వీరశేఖర్, పాల్గొన్నారు



నీటిని సంరక్షించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ తదితరులు

## రైతు రుణమాఫీ, రైతు భరోసా కోసం నాదర్గుల్లో అన్నదాతల ఆందోళన

-భాగ్యనగర్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్న రైతులు

-ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్న చైర్మన్ హామీతో శాంతించిన అన్నదాతలు

**సరూర్నగర్, మార్చి 24 ప్రభాతవార్త:**

రైతు రుణమాఫీ, రైతు భరోసా అందని అన్నదాతలు భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆందోళన చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ, రైతు భరోసా సాయం నేటికీ అందలేదనీ ఆగ్రహం వ్యక్తం చేసిన రైతన్నలు సర్వ సభ్య సమావేశాన్ని అడ్డుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని నాదర్గుల్ గ్రామంలోనున్న భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం సర్వ సభ్య సమావేశం పిఏసి ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. అయితే సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి పిండి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం ప్రారంభం కాగానే పలువురు రైతులు రుణమాఫీ, రైతు భరోసాలపై గళం విప్పారు. రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారనీ.. రైతు భరోసా ఎప్పుడు అందిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు మర్రి అంజిరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, జక్కిడి రాంరెడ్డి, ఏనుగు వెంకట్రెడ్డి, మెకం సుదర్శన్, చెరుకుపల్లి వెంకట్రెడ్డిలతో పాటు సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్నారు. వీరికి పలువురు రైతులు మద్దతు తెలపడంతో సర్వసభ్య సమావేశం ముందుకు సాగలేదు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్న ఛైర్మన్ హామీతో శాంతించిన రైతులు**

రైతుల ఆందోళనతో స్పందించిన సొసైటీ పిఏసి ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి వారిని శాంతింపజేయడానికి ప్రయత్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా అందని రైతుల విషయమై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అదే విధంగా జిల్లా సహకార అధికారి (సిఇఒ), డిసిసిబి ఛైర్మన్ లకు కూడా నివేదిస్తానని ఆయన నచ్చజెప్పడంతో ఎట్టకేలకు రైతులు శాంతించారు. అనంతరం సర్వ సభ్య సమావేశం ప్రారంభమై సజావుగా జరిగింది. ఈ సభలో సిఇఒ సొసైటీ వార్షిక నివేదిక చదివి వినిపించారు. అదే విధంగా సంఘ ప్రగతిపై చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ బంగారి బాబు, మాజీ ఛైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, పిఏసి డైరెక్టర్లు తోట ప్రతాప్రెడ్డి, యెల్చల సుదర్శన్రెడ్డి, తిరుపతి గిరిరాజ్, పెద్దబావి మోహన్రెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ సువర్ణ, రైతులు తీగల చెన్నారెడ్డి, యాతం లింగమయ్య, పుట్టగళ్ళ అశోక్, లాలం బాలనర్సింహ యాదవ్, జెనిగె శ్రీను, జెనిగె యాదయ్య, గుమ్మడి మహేందర్రెడ్డి, తోట రంగారెడ్డి, వల్లపు మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేసిన రైతులను శాంతింపజేసి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

## అర్హులైన పేదలందరికీ డబుల్బెడ్రూం ఇళ్లను అందించాలి : సిపిఐ

**హయత్నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** హయత్నగర్ మండలంలో అర్హులైన నిరుపేదలకు డబుల్బెడ్రూం ఇళ్లను కేటాయించాలని సీపీఐ రాష్ట్రకమిటీ కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులకు ఇళ్లను కేటాయించాలని కోరతూ సీపీఐ హయత్నగర్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం హయత్నగర్లోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో డబుల్ బెడ్రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ఇళ్లను కేటాయించాలని, తాజాగా చేసిన సర్వే ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో పేదలు సంక్షేమ పథకాలకు అనర్హులయ్యారని, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు పథకాలను కూడా అందించాలన్నారు. హయత్నగర్ మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణాలకు 6 లక్షల సహాయం కూడా అందించాలన్నారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ ఎల్.బి.నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్రెడ్డి, సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ, నాయకులు మర్రిశోభన్, బొంగు అరుణ్కుమార్గౌడ్, సామిడి వంశీవర్ధన్రెడ్డి, రమావత్ సక్రునాయక్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

## జిహెచ్ఎంసిలో ప్రధాని మోదీ చిత్రపటం ఏర్పాటు చేయాలి



ఉప్పల్ డిసి అంజనేయులుకు ప్రధాని మోదీ చిత్రపటాన్ని అందజేస్తున్న బిజెపి నేతలు మార్నెని పణీందర్, శిల్పారెడ్డి, ధర్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీతోపాటు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిత్రపటాలు ఏర్పాటు చేయాలని బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్, రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, శామీర్పేట ధర్మారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులును కలిసి ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోదీ చిత్రపటాలు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు యు.బల్వంతాచారి, బ్రహ్మచారి, ఈగ లక్ష్మణ్, తీగ విఠల్రావు, పంజాల శ్రవణ్ గౌడ్, శ్రీధర్గుప్త, శ్రీనివాస్గౌడ్, నరసింహారెడ్డి, అంజిరెడ్డి, పద్మ, నామ అనిత, దువ్వాల రమేష్, ఎ.రమేష్, సిద్దర్ల జాన్, భాగ్యరాజు, స్వామిగౌడ్, సతీష్, రాజుచారి తదితరులు పాల్గొన్నారు.

### ఎఐసిసి తరుణ్ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్గా రాఘవేందర్రెడ్డి



**సరూర్నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** ఎఐసిసి తరుణ్ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్గా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్గూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి రాఘవేందర్రెడ్డి నియమితుల య్యారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ అధికారంలోకి రాక ముందు పలు ఉద్యమాలు, ధర్నాల్లో చురుకుగా పాల్గొన్న రాఘవేందర్రెడ్డి కాంగ్రెస్కు అందించిన సేవలను గుర్తించిన పార్టీ పెద్దలు ఆయనకు పదవి కోసం సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో రాఘవేందర్రెడ్డిని ఎఐసిసి తరుణ్ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్గా నియమించారు. ఈ మేరకు ఎఐసిసి తరుణ్ విచార్ విభాగ్ ఛైర్పర్సన్, కాంగ్రెస్ సందేశ్ ఎడిటర్ అయిన ఎంపి డాక్టర్ గిరిజా వ్యాస్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా రాఘవేందర్రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిలో నియమించిన అధిష్టానవర్గానికి,సిఎం రేవంత్రెడ్డికి,టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్కుమార్గౌడ్కు,గిరిజా వ్యాస్లకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీని అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేసి చిత్తశుద్ధిని చాటుతానని ఆయన స్పష్టం చేశారు.

## మీర్పేట్ కార్పొరేషన్లో ఇంటి పన్నులను తగ్గించే వరకు తగ్గేదేలే



సమావేశానికి హాజరైన బిజెపి సీనియర్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు

**సరూర్నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో పెంచిన ఇంటి పన్నులను తగ్గించే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 27వ తేదీన రిలే నిరాహార దీక్షలను చేపట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి నిర్ణయించింది. సోమవారం మీర్పేట్-జిల్లెలగూడ రోడ్డులోని సిద్దాల దశరథ కాంప్లెక్స్లోనున్న కనక దుర్గ కన్వెన్షన్ హాల్లో కార్పొరేషన్-1, 2 బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్ల సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేషన్కు చెందిన రాష్ట్ర, జిల్లా, మున్సిపల్ కార్పొరేషన్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటి పన్నుల తగ్గింపు కోసం జిల్లా కలెక్టర్, సిడిఎంఎ, మున్సిపల్ కమీషనర్లకు బిజెపి తరపున వినతి పత్రాలు ఇచ్చిన విషయాన్ని చర్చించారు. అయితే ప్రజల పక్షాన నిలిచే బిజెపి ఇంటి పన్నులను తగ్గించే వరకు తగ్గేది లేదని స్పష్టం చేస్తూ ఈ నెల 27న గురువారం ఉదయం మీర్పేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను చేపట్టాలని నేతలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు, కాలనీ సంక్షేమ సంఘాలు, కాలనీల ప్రజలను ఈ దీక్షలో భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని వారు తీర్మాణించారు. ఈ సమావేశంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్రెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోడూరు సోమేశ్వర్, జిల్లా నాయకుడు మద్ది రాజశేఖర్రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మోడల బాలకృష్ణ సాగర్, జిల్లెల అరుణ ప్రభాకర్రెడ్డి, కీసర హరినాథ్రెడ్డి, కొంద్రు గౌరీ శంకర్, భీమ్రాజ్, కీసర జమునా కృష్ణారెడ్డి, ధరంకార్ జ్యోతి కిశోర్, మాజీ వార్డు సభ్యులు కాసోజు అర్పిత రాధాకృష్ణ, గడ్డం జగన్, బెల్లం కొండ నాగరాజులతో పాటు విక్కీ సాగర్, జెడి కుమార్, బచ్చనమోని కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్, సుధాకర్, సిద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప ఆలయ పునః నిర్మాణానికి భారీ విరాళం

**ఉప్పల్, మార్చి 24 ప్రభాతవార్త :** రామంతాపూర్లో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం పునః నిర్మాణానికి రామంతాపూర్ ఆర్యవైశ్య సంఘం నేతలు దొడ్డి అశోక్గుప్త, శ్రీదేవి దంపతులు రూ.లక్ష 11,116 విరాళం అందజేశారు. అదే విధంగా రామంతాపూర్ ఆర్య వైశ్య సంఘం సీనియర్ నేత శంబు పాండయ్యగుప్త, జయమ్మ దంపతులు రూ.51వేల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటి నేతలకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం అభివృద్ధికి తమ వంతు చేయూత అందిస్తామని తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు మురళీధర్నాయర్, రాజిరెడ్డి, రేవు నరసింహ, నగేష్గుప్త, రామేశ్వర్గౌడ్, అరుణ్, సాయి, రాజేష్ పాల్గొన్నారు.

## నూతన తరానికి స్ఫూర్తిదాయకం భగవంత రెడ్డి కవిత్వం



**వనస్థలిపురం. మార్చి. 24.ప్రభాతవార్త**

సామాజిక బాధ్యతలు నెరవేర్చుతూనే జరుగుతున్న అన్యాయాలపైన సుదీర్ఘ ప్రతిఘటనను సాగిస్తున్న భగవంత రెడ్డి ఆంగ్ల కవిత్వం నూతన తరానికి స్ఫూర్తిదాయకంగా ఉందని ఆంగ్లోపన్యాసకులు, రిటైర్డ్ ప్రిన్సిపల్ పెండ్యాల హరీంద్రనాథ్ అన్నారు. సోమవారం ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్లో ఆచార్య కట్ట.భగవంత రెడ్డి రచించిన జర్నీ త్రు స్ప్రింగ్ అండ్ థండర్ అనే ఆంగ్ల పద్య కావ్యాన్ని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ఆవిష్కరించారు. జర్నీ త్రు స్ప్రింగ్ అండ్ థండర్ పద్య కావ్యాన్ని హరేంద్రనాథ్ విశ్లేషించారు. సాహిత్యాన్ని వెనుకటి తరం చదివినంతగా, ఆదరించినంతగా ఇప్పటి తరం ఆదరించక పోవడానికి మీడియం ఒక కారణమని హరేంద్రనాథ్ అభిప్రాయపడ్డారు. తెలుగులో కంటే ఆంగ్లంలో నేటి తరం ఎక్కువ చదివే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాశం యాదగిరి మాట్లాడుతూ వర్తమానం కాదు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రచనలు కొనసాగించాలన్నారు.ప్రకృతి ధ్వంసం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రచయితలపై ఉందన్నారు.భగవంతరెడ్డి సామాజిక బాధ్యతతోనే ఈ ఆంగ్ల కావ్యం రాశారని ఆయన అభిప్రాయపడ్డారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పాటలతో అలరించారు. పి ఓ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు జి అనసూయ అధ్యక్షత వహించిన ఈ పుస్తకావిష్కరణ సభలో పి ఓ డబ్ల్యు జాతీయ నాయకురాలు

## డబ్బులు పంచకుండా గెలిచినప్పుడే నిజమైన స్వతంత్రం



**వనస్థలిపురం. మార్చి. 24.ప్రభాతవార్త :**

విద్య ,వైద్యం, రాజకీయాలను వ్యాపారం చేస్తున్నారని డబ్బులు పంచకుండా ఎన్నికల్లో నాయకులు గెలిచినప్పుడు నిజమైన స్వతంత్రం వచ్చినట్లని ప్రముఖ నటుడు, డైరెక్టర్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మాదాల రవి. సినీ నటి, యాంకర్ ఉదయ భానులు అన్నారు. భగత్ సింగ్ సుఖదేవ్ రాజ్ గురువుల 94వ వర్ధంతి సందర్భంగా మాభూమి సాహితి సంస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురం వాసవి శ్రీ నిలయంలో తల సేమియా పిల్లల కోసం ఉచిత రక్తదాన శిబిరం, అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిటీ సివిల్ జడ్జ్ మురళీ మోహన్, డైరెక్టర్ నటుడు మాదాల రవి సినీనటి యాంకర్ ఉదయభాను, సిఐడి ఏసిపి ఏ. మాధవి లత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ ఒక శక్తి అని 21 ఏళ్ల వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో. వనస్థలిపురం ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు. వేద భూమి ప్రతినిధులు,నరసింహ ప్రసాద్. ఉదయ్ శంకర్. నాగిరెడ్డి. కేశవరావు పద్మలత మూర్తి , శరణ్య. తదితరులు పాల్గొన్నారు.

### అన్ని పార్కుల్లో డస్ట్బిన్స్ ఏర్పాటు : కార్పొరేటర్



డస్ట్బిన్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్రెడ్డి

**సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పార్కుల్లో డస్ట్ బిన్స్ ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్రెడ్డి అన్నారు. జయనగర్, ఎస్బిఐ కాలనీ తదితర కాలనీ పార్కులలో ఏర్పాటు చేసిన డస్ట్బిన్స్ను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కులకు వచ్చే ప్రజలు చెత్తను పార్కుల్లో వేయకుండా డస్ట్బిన్స్ ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్రెడ్డి, గుర్రం మోహన్రెడ్డి, హార్టికల్చర్ సూపర్వైజర్ మహేష్, స్థానిక మహిళలు విజయ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### శుభోదయ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి

**సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ శుభోదయ కాలనీలో ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి సోమవారం అధికారులతో కలసి పర్యటించారు. యుజిడిని ఆధునికీకరించిన తర్వాతే నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్రెడ్డి మాట్లాడుతూ శుభోదయ కాలనీలో నూతన రోడ్ల మంజూరు కావడం జరిగిందని అయితే స్థానికంగా యుజిడి వ్యవస్థ సరిగ్గా లేదని తెలిసి తాత్కాలింగా రోడ్ల నిర్మాణాన్ని ఆపివేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది ఇంచుల యుజిడి స్థానంలో పన్నెండు ఇంచుల యుజిడి నిర్మాణం చేపట్టాలని, యుజిడి నిర్మాణంలో లెవల్స్ సరిగ్గా చూసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. యుజిడి నిర్మాణం పూర్తయిన తర్వాత నూతన రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్వర్క్స్ అధికారులు రమ్యభారతి, షబ్బీర్, శ్రీహరి, శ్రీనివాస్తో పాటు బిఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని లైన్స్ క్లబ్ హెల్త్ క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షెపర్డ్ అధ్యక్షులు లయన్ రోయ్యురు సురేష్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జగన్



జగన్కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

**ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డి అన్నారం డివిజన్ కు చెందిన జగన్ యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ 5 అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆదివారం జారీ చేసిన నియామక పత్రాన్ని జగన్ కు ఆలోచించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘానికి కృషి చేస్తామని అన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

### పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న చిలుకా ఉపేందర్రెడ్డి, ఎండి.జహంగీర్

**ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** పండుగలు అందరి మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్రెడ్డి పేర్కొన్నారు. ఆర్కెపురం డివిజన్ మార్గదర్శికాలనీలో సీనియర్ నాయకుడు మొహమ్మద్ జహంగీర్ నివాసం వద్ద రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రంజాన్ మాసంలో కఠినమైన ఉపవాసాలు చేస్తూ పవిత్రంగా అల్లాను ప్రార్థిస్తూ నిరుపేదలకు మనము సంపాదించిన దాంట్లో కొంత భాగం పేదవారికి సహాయం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధానకార్యదర్శి మొహమ్మద్ షాహిద్, మొహమ్మద్ మహమ్మద్, ఆసిఫ్, మొహమ్మద్ ఇస్మాయిల్, మొహమ్మద్ జహీర్, పగడాల ఎల్లన్న పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చింతల అరుణాసురేందర్ యాదవ్

**ఎల్.బి.నగర్, మార్చి 24 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలోని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో వారి నివాసంలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ నాగోల్ డివిజన్ లోని మున్సిపల్ మహిళ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగించడంతోపాటు నిరుపేదలకు అండగా నిలుస్తామన్నారు.

### గౌడ స్మశానవాటిక అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ గౌడ సంఘం నేతలు

**ఉప్పల్, మార్చి 24 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్పగడ్డలోని గౌడ స్మశానవాటిక అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు గౌడ సంఘం నేతలు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, గౌడ సంఘం నేతలు బజారు మురళీగౌడ్, పల్లె రాజ్కుమార్గౌడ్, నెర్థం భాస్కర్గౌడ్, నవీన్, బింగి భరత్ గౌడ్, శ్రవణ్గౌడ్, బజారు అర్జున్గౌడ్, బజారు రామరాజుగౌడ్, ఎల్లగోని ప్రకాష్గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు మాట్లాడుతూ బీరప్పగడ్డలోని గౌడ స్మశానవాటికలో మౌళిక సదుపాయాలు లేవని, స్నానపు గదులు నిర్మించాలని, స్మశానవాటిక అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే స్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

### శ్రీనగర్కాలనీలో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత



శ్రీనగర్ కాలనీలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, మార్చి 24 ప్రభాతవార్త :** చిలుకానగర్ శ్రీనగర్కాలనీలో రూ.62లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పురాతన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేస్తున్నామని తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్రెడ్డి, కె.జగన్, నారాయణరెడ్డి, మహేందర్, కాలనీ అధ్యక్షుడు కొండయ్య, మనోహర్రావు, అంజయ్య, శ్రీనివాస్, ప్రభాకర్రెడ్డి, మల్లేష్, మహేష్, రణదీర్, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

### పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిరెడ్డి అనంతరెడ్డి

**సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** పిఆర్టియు టిజి నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిరెడ్డి అనంతరెడ్డి నియమితులయ్యారు. ఖైరతాబాద్లోని జిల్లా పరిషత్ హాల్లో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో అనంతరెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచిరెడ్డి అనంతరెడ్డికి పిఆర్టియు వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్రెడ్డి హర్షవర్ధన్రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పిఆర్టియు నిరంతర పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్టియు కట్టుబడి ఉందన్నారు. పిఆర్టియు పోరాటాల ఫలితంగా గతంలో ఎన్నో సమస్యలు పరిష్కారం కావడం జరిగిందని, రాబోయే రోజుల్లో కూడా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సారెడ్డి వెంకట్రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.